సాంకేతిక మార్పులను విస్తరించాలి

యూనియన్ బ్యాంక్ డిజిఎం సత్యం



నవతెలంగాణ-సంగెం

మహిళలు సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుకూలంగా వ్యాపారాలను విస్తరించాలని, యూనియన్ బ్యాంకు మహిళలను వ్యాపారవేత్తలుగా చేయటానికి కావల సినంత ఆర్థిక సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని బ్యాంకు డీజీఎం సత్యం పాల్గుల అన్నారు. మంగళవారం కష్ణవేణి గ్రామ సంఘాన్ని సందర్శించి, సంఘ లీడర్లతో బ్యాంకు రుణాల ద్వారా మహిళలు చేస్తున్న వ్యాపారాల గూర్చి తెలుసుకున్నారు.స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకు రుణాలను సక్రమంగా చెల్లించి,బ్యాంకర్లకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యుబిఐ సంగెం బ్రాంచి మేనేజర్ అనీల్, అగ్రికల్చర్ ఇంచార్జి జీవన్, ఏపిఎం కిషన్, సీసీ లు రాజయ్య,కష్ణమూర్తి,కుమార స్వామి,సురేష్, విఓ అధ్యక్షురాలు రాజమని ,విఓఏ విజయ, సంఘాల లీడర్లు,తదితర మహిళలు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

వరంగల్

బుధవారం | సెప్టెంబర్ 20, 2023 | www.navatelangana.com

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేసుకోవాలి

జిల్లా పౌర సరఫరాల అధికారి కె చందన్ కుమార్



నవతెలంగాణ-వరంగల్

వరంగల్ జిల్లాలోని రేషన్ కార్డుదారులందరు ఈ కేవైసీ నవీకరణ చేసుకోవాలని జిల్లా పౌరసరఫరా ల అధికారి కే. చందన్ కుమార్ సూచించారు. మం గళవారం వరంగల్ జిల్లా ఈపాస్ టెక్నీషియన్స్ తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు రేషన్ షాప్ డీలర్ల వద్ద రేషన్ కార్డుదారులు ఈకేవైసీ 100 శాతం డేటాను పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం ఈ కేవైసీ ప్రచార అవగాహనలో భాగం గా జిల్లా పౌరసరఫరాల , సహాయ పౌరసరఫరాల అధికారి ఉప తాసిల్దార్ వరంగల్ జిల్లాలోని వరం గల్ మండలంలో రేషన్ షాప్ నెంబర్ 71 ఇతర షాపులను దర్శించి ప్రజలను చైతన్య పరిచి ఈ కేవైసీ పైన అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఈ పాస్ డీసీ రాజుకుమార్ పాల్గొన్నారు.



ఏడవ రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ దీక్షలు

నవతెలంగాణ-కాశిబుగ్గ

ప్రస్తుత పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్పి వరంగల్ తూర్పు ఇన్చార్జి ఈర్ల కుమార్ మాదిగ ఆధ్వర్యంలో కాశీబుగ్గ అంబేద్కర్ జంక్షన్ లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం ఏడవ రోజుకు చేరాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ మంద రాజు మాదిగ మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంటు సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని లేనియెడల బిజెపికి మాదిగలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కాగా ఈ రిలే నిరాహార దీక్షలకు మంగళవారం తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు నలిగంటి చంద్రమౌళి, మహాత్మ జ్యోతిబాపూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్, మహాజన కార్మిక సంఘం అధ్యక్షుడు జన్ను ఆనందం సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, గాయకుడు లింగాల ఇమ్మానియేల్ తొలి తరం దండోరా నేత గద్దల కుమారస్వామి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు గంగారపు మల్లన్న, పసునూరి పేతురు, కన్నూరు శేఖర్, పసునూరి చిన్న, ఈర్ల విప్లవ కుమార్ పాల్గొన్నారు.


22న కేజీకేఎస్ ధర్నా జయప్రదం చేయండి

నవతెలంగాణ -నర్సంపేట

ఈ నెల 22న ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నా జయప్రదం చేయాలని కల్లు గీత కార్మిక సంఘం వరంగల్ జిల్లా ఇన్చార్జి మేరుగు వీరాస్వామి కోరారు. సోమవారం ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్ లో ధర్నా పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కల్లు గీత కార్మికులకు 15శాతం రిజర్వేషన్ కల్పించాలని, బ్రాండీ షాపులు కేటాయింపు, బైక్ లు, రూ.లక్ష ఆర్థిక సహాయం, ప్రతి సొసైటీకి రూ.10లక్షలు తదితర డిమాండ్ లను పరిష్కరించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న ధర్నాకు గీత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపెల్లి నర్సయ్య, ముత్యం రామ్ చందర్, ముంజాల రమేష్, ఏ.తిరుపతి, శ్రీనివాస్,కట్టయ్య, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చెట్ల పొదలు తొలగించాలి

నవతెలంగాణ - పర్వతగిరి



మండలం లోని చింతనెక్కొండ శివారు క్రాస్ రోడ్ వద్ద రాయల్ బిర్యానీ పాయింట్ వద్ద పలు ప్రమాదాలు జర్గుతున్నాయి. ప్రధానంగా అక్కడున్న చెట్ల పొదలు గుబురుగా పెరిగిన కారణంగా అటు వైపు నుండి వస్తున్న వాహనాలు ఇటు వైపు కనపడక ఎదురెదురుగా వాహనాలు అతి వేగంగా రావటం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.చింతనెక్కొండ నుండి నెక్కొండకు,అలాగే సాయిరెడ్డి పల్లి ఇటు వరంగల్ వైపు కు నిరంతరం వాహనాలు వెళుతూ వుంటాయి.ఇక్కడ హెచ్చరిక బోర్డు లు సైతం లేవు దీంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చెట్ల పొదలు తొలగించి ప్రమాదాల నివారణకు తోడ్పడాలని పలువురు కోరుతున్నారు.

పార్థివదేహం కేఎంసికి అప్పగింత

నవతెలంగాణ-కాశిబుగ్గ



సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ వరంగల్ జిల్లా నాయకుడు గంగుల దయాకర్ తల్లి గంగుల రాజమణి అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం ఆమె పార్థివదేహాన్ని నగరంలోని కాకతీయ మెడికల్ కాలేజీకి అప్పగించారు. న్యూ డెమోక్రసీ నాయకులు రాజమణి సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు ఆరెల్లి కృష్ణ మాట్లాడుతూ రాజమణి పోలీసుల నిర్బంధాన్ని ఎదుర్కొని అనేక మంది విప్లవకారులకు అన్నం పెట్టి ఆదరించే వారిని గుర్తు చేశారు. గంగుల దయాకర్ మాట్లాడుతూ తన కుటుంబం మొదటి నుండి కార్మిక వర్గానికి చెందినదని తాను చిన్ననాటి నుండి విప్లవ భావాలు కలిగి ఉండడం వల్ల తన తల్లి ప్రోత్సహించేదని అన్నారు. భావితరాల వైద్య విజ్ఞాన అభివద్ధి కోసం తన తల్లి పార్థివదేహాన్ని కేఎంసికి అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోన్ రెడ్డి మల్లారెడ్డి, న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు బండి కోటేశ్వరరావు, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు ప్రధాన శత్రువు బీజేపీ

నవతెలంగాణ-చెన్నారావుపేట



ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును ఈనెల 18 నుండి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంటు సమావేశంలో ఆమోదించాలని టీ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నమిండ్ల చిన్నస్వామి, దళిత రత్న వడ్డూరి కుమార్ స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని టీ, ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షుడు ఆకులపల్లి ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన మండల విస్తతస్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ, కేంద్రంలో అధికారాలు ఉన్న బిజెపి పార్టీకి నమ్మకం పెట్టుకున్న 9 ఏండ్ల అధికారంలో వర్గీకరణ బిల్లును చేస్తామని చెప్పానే మాదిగలను మోసం చేస్తుందన్నారు. బిజెపికి ఇదే చివరి అవకాశమని, వచ్చే ప్రత్యేక పార్లమెంటు సమావేశంలో బిల్లు పెట్టకపోతే బిజెపి ఏ మాదిగల ప్రధాన శత్రువుగా మాదిగ సమాజం భావించాల్సి ఉంటుందన్నారు. అలాగే రాష్ట్రంలో బారాస అధికారంలో ఉండి కూడా ఏనాడు కేంద్ర ప్రభుత్వంపై బిల్లు పెట్టాలని ఒత్తిడి తీసుకోకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బర్ల స్వామి, ఎమ్మార్పీఎస్ మండల మహిళ అధ్యక్షురాలు మాదాసి లత, పైసా రజిత, తాళ్ల యాదయ్య, నెక్కొండ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తడుగుల జనార్ధన్ పాల్గొన్నారు.

గృహలక్ష్మి ఇండ్లకు భూమిపూజ

నవతెలంగాణ - పర్వతగిరి



మండలంలోని నారాయణపురంలో గృహలక్ష్మి పథకం కింద మంజూరైన ఇండ్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామ్మోహన్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి వెంకటేశ్వర్ రావు, సి కే తండాలో సర్పంచ్ దేశిరాం ఇంచార్జీలు కొమురయ్య, భద్రు ఆధ్వర్యం లబ్దిదారులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళా బిల్లుతో.. సగం సీట్లు వాళ్లకే..

మహిళా నేతల్లో హర్షాతిరేకం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి :

పార్లమెంటులో మహిళా బిల్లుకు ఆమోదముద్ర పడితే 2029 ఎన్నికల్లో సగం సీట్లు మహిళా నేతలకే దక్కే ఛాన్స్ వుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5 లేదా 6 అసెంబ్లీ నియోజకవర్గాలు మహిళలకే దక్కే అవకాశముంది. వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, మహబూబాబాద్ (ఎస్టీ), ములుగు (ఎస్టీ), వర్ధన్నపేట (ఎస్సీ), స్టేషన్‌ఘన్‌పూర్ (ఎస్సీ) నియోజకవర్గాలు రాబోయే రోజుల్లో మహిళా రిజర్వ్‌డ్ అయ్యే ఛాన్స్ వుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహిళల ఓట్లు అధికంగా వున్న నియోజకవర్గాలు 6 వున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ములుగు (ఎస్టీ) నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించిన సీతక్క మాత్రమే మహిళా శాసనసభ్యురాలు కావడం గమనార్హం. ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న మహిళా బిల్లు పార్లమెంటులో ఆమోదముద్ర పడే అవకాశముండడంతో మహిళా నేతల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతుంది.

పార్లమెంటులో మహిళా బిల్లుకు ఆమోదం లభిస్తే అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల్లో 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు దక్కనున్నాయి. ఈ బిల్లు నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తారా ? లేదా ? 2029 ఎన్నికల్లో అమలు చేస్తారా ? అనే విషయంలో స్పష్టత రావాల్సి వుంది. మహిళా బిల్లు అమలు విధి విధానాలను రూపొందించి నియోజకవర్గాల పునర్విభజన చేసిన అనంతరం 2029 ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లను అమలు చేసే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

6 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అధికం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట (ఎస్సీ), స్టేషన్‌ఘన్‌పూర్ (ఎస్సీ), మహబూబాబాద్ (ఎస్టీ), ములుగు (ఎస్టీ)

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
వరంగల్ తూర్పు	1,18,638	1,23,211	235	2,42,084
వరంగల్ పశ్చిమ	1,35,297	1,36,855	--	2,72,152
స్టేషన్‌ఘన్‌పూర్	1,18,168	1,18,825	1	2,36,994
మహబూబాబాద్	1,18,611	1,20,092	--	2,38,703
వర్ధన్నపేట	1,27,082	1,28,421	--	2,55,503
ములుగు	1,04,795	1,07,257	--	2,12,068

నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అధికంగా వున్నారు. వీరే కాకుండా నర్సంపేట, పరకాల నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లు అధికంగా వున్నారు.

ఒకే మహిళా ఎమ్మెల్యే

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలున్నా గత ఎన్నికల్లో ములుగు (ఎస్టీ) నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా సీతక్క మాత్రమే విజయం సాధించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా సింగాపురం ఇందిరా, వరంగల్ తూర్పు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా కొండా సురేఖ పోటీ చేసినా ఓడిపోయారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి పలువురు మహిళా నేతలు ఎమ్మెల్యేలుగా గెలిచి మంత్రులయ్యారు. చెన్నూరు నియోజకవర్గం నుండి ఎన్. విమలాదేవి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నర్సంపేట నుండి కాకుమాను కనకరత్నమ్మ ఎమ్మెల్యేగా గెలిచారు. శాయంపేట, పరకాల, వరంగల్ తూర్పు నియోజకవర్గాల నుండి కొండా సురేఖ ఎమ్మెల్యేగా విజయం సాధించి మంత్రిగా వ్యవహరించారు. డోర్నకల్ నుండి గతంలో టిడిపి అభ్యర్థిగా సత్యవతి రాథోడ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా మాలోత్ కవిత ఎమ్మెల్యేగా విజయం సాధించారు. పరకాల నియోజకవర్గం నుండి టిఆర్ఎస్ అభ్యర్థిగా బండారి శారారాణి పోటీ చేసి గెలిచారు.

ప్రభుత్వ భూములకు రక్షణేది..!

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య సమ్మయ్య

తాసిల్దార్ కార్యాలయం ముందు సిపిఎం రిలే దీక్షలు



నవతెలంగాణ - నెక్కొండ

నెక్కొండ మండలంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందని ఇష్టానుసారంగా ఆక్రమించుకుంటూ పోతున్నారని, రక్షించాలనే కలెక్టర్ ఆదేశాలను సైతం అమలుకు నోచుకోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య సమ్మయ్య అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టగా వారిపై కేసులు పెట్టే శ్రద్ధ ప్రభుత్వ భూమిని రక్షించడంలో లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు భూక్య సమ్మయ్య. మండల కార్యదర్శి ఈదునూరి వెంకన్నతోపాటు కార్యకర్తలు, ప్రజలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ప్రారంభించి ప్రభుత్వ భూమిని రక్షించేంతవరకు దీక్షలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం పారదర్శకత వహించి నెక్కొండలోని 436, 32/1లో గల భూములను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి రైతుబంధు పథకాన్ని పొందుతున్న బొబ్బల యాదవ రెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. హరిజన, గిరిజనులపై అక్రమ కేసులు బనాయించిన బొబ్బల యాదవ రెడ్డి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సర్వేయర్, జిల్లా సర్వేర్లు కబ్జా కోరుతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమించి ప్రభుత్వ అగ్నిమాపక కేంద్రాన్ని కూల్చివేసి దాని భూమిని సాగు చేస్తున్న బొమ్మల యాదవ రెడ్డి యదేచ్ఛగా తిరుగుతున్న చూసి చూడనట్టు వ్యవహరించడం హాస్యాస్పదమన్నారు. నెక్కొండ శివారులో, మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిని మరో 100 ఎకరాల భూమిని బయటపెట్టి పేదలకు పంచేంతవరకు మా యొక్క పోరాటాన్ని ఉద్ధతం చేస్తామని సిపిఎం మండల కార్యదర్శి ఈదునూరి వెంకన్న అన్నారు. కలెక్టర్ ఆదేశాలను అనుసరించి కబ్జాకోరుపై తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కవిత, రాధ,వీరమ్మ, కమలమ్మ, స్వప్న, హైమా, రమ, కవిత, సునీత,సంతోష,బుల్లి,సుభద్ర,బండి రామస్వామి, సోబియా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, ప్రయివేటు మెడికల్ షాపుల యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-మట్టెవాడ

ఎన్ఎంసి ఆర్ఎంపి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ , మెడికల్ షాపుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అన్నారు డివైఎఫ్ఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ధర్మారపు సాంబమూర్తి అన్నారు.భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా వైద్య శాఖ అధికారి కాజీపేట వెంకటరమణకు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ ప్రజలను ఆర్థికంగా దెబ్బతీస్తున్న ఆర్.ఎం.పి ప్రైవేట్ మెడికల్ షాపుల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం మెమొరండాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగల్ జిల్లాలో 2023 ఎన్ఎంసి ఆర్ఎంపి రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీస్ నిబంధనలను పాటించకుండా పెద్ద ఎత్తున ధనార్జనే ధ్యేయంగా ఆర్ఎంపీలు అవసరం లేకున్నా అమాయకులైనటువంటి ప్రజల ఆరోగ్య పరిస్థితులను దష్టిలో పెట్టుకొని బ్రాండెడ్ మందులను యాంటీబయాటిక్స్, గ్లూకోజ్ బాటిల్, ఇంజక్షన్లను ప్రిఫర్ చేస్తూ వారు నిబంధనలను మరిచి మెడికల్ షాపులతో ఒప్పందం కుదుర్చుకొని అవసరం లేకపోయినా రక్త పరీక్షలు మూత్ర పరీక్షలు చేయిస్తూ ధనాన్ని సొమ్ము చేసుకుంటున్నారనీ అన్నారు. ఎన్ఎంసి ఆర్ఎంపి నిబంధనల ప్రకారం ఆర్.ఎం.పి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ క్యాపిటల్ లెటర్స్ లో రాయాలి అందరూ చదివే రీతిలో ప్రిస్క్రిప్షన్ ఉండాలి కానీ వీటికి విరుద్ధంగా ఆర్.ఎం.పి లందరూ కూడా వ్యవహరిస్తున్నారు కేవలం బ్రాండెడ్ మందులనే రాస్తూ సంపాదన సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారు. కానీ ఎన్ ఎం సి జనరిక్ మెడిసిన్ ని మాత్రమే డిస్క్రిప్ చేయాలని అలా చేయడం వలన వైద్య ఖర్చులు 30 శాతం నుండి 80 శాతం వరకు తగ్గించడంతోపాటు అందరికీ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణలో అందించినట్లు అవుతుందని ఎన్ఎంసి తన నిబంధనలో పేర్కొనడం జరిగిందనీ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆర్ఎంపీలపై మెడికల్ షాపుల యాజమాన్యాలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని వారి లైసెన్సులను రద్దు చేయాలని డివైఎఫ్ఐ వరంగల్ జిల్లా కమిటీగా డిమాండ్ చేస్తున్నాట్లు పేర్కొన్నారు. అదేవిధంగా వరంగల్ జిల్లా ప్రజలకు జనరిక్ మందులపై అవగాహనను కల్పించాలని డి ఎం హెచ్ ఓ ను కోరడం జరిగిందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బొక్క చిరంజీవి, గద్దల ప్రశాంత్, బేతి రాజేష్, ఎండి సమీర్, కాలువ నరేష్ ,దూడం రాజేష్, గోపిరెడ్డి క్రాంతి, గోగుల బాబు, సుగుణాకర్, కంచర్ల విక్రం, తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ ద్వారా ఉజ్వల భవిష్యత్తు


వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

నవతెలంగాణ-వరంగల్

ఎన్ సీ సీ ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటదని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళ వారం క్యాంప్ కమాండెంట్ కల్నల్ అజయ్ నంద కందూరి సమక్షంలో పీటీసీ మామ్నూరులో 500 మంది ఎన్సీసీ క్యాడెట్లు ఫైరింగ్ లో, డ్రిల్ లో, వివిధ రంగాలలో జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్ సీ సీ అనేది చాలా క్రమశిక్షణతో కూడుకున్న సంస్థ అని,ఇష్టపడి చదవాలని అన్నారు. ఇందులో ఏ సర్టిఫికెట్, బీ సర్టిఫికెట్, సీ సర్టిఫికెట్ పొందడం వలన ఉజ్వల భవిష్యత్తు, మంచి ఉద్యోగాలలో స్థిరపడతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ నిమ్బాల్కర్ వీర చక్ర, పీ టీ సీ ప్రిన్సిపల్ పూజ ఐపీఎస్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, కెప్టెన్ డాక్టర్ పి సతీష్ కుమార్, క్యాంప్ అడ్జి టాన్ట్ లెఫ్టినెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీలత, ఓంకా ర్, బాల రెడ్డి, వాసు, భవాని, జీ సీ ఐ గాయత్రి, సుబేదార్ మేజర్ సువాస్ కదం, నారాయ ణరెడ్డి, శ్రీనివాస్, సతీష్ గౌడ, కవిత, పుల్లి బాయ్, కుమా రస్వామి మరియు 500 మంది ఎన్ సీ సీ క్యాడె ట్లు తదితరులు పాల్గొన్నారు. ఈ పది రోజుల క్యాంపులో ఫైర్ ఫైటింగ్, సైబర్ క్రైమ్, ట్రాఫిక్ అవగాహన, యోగ ఇట్టి కార్యక్రమాలకు నిష్ణాతు లను తీసుకువచ్చి పిల్లలలోపట్ల సమాజంలో జరిగే విషయాల గురించి తెలిపారు.

వజ్రోత్సవాలకు మంత్రి నిరంజన్ కు ఆహ్వానం

నవతెలంగాణ-కాశిబుగ్గ



ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న వజ్రోత్సవాలకు హాజరుకావాలని మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు హైదరాబాదులో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని ఆహ్వానించారు. ఈసందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మనేని రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్లాటినం జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఈనెల 30న జరుగుతున్న వజ్రోత్సవాల ప్రారంభోత్సవ మరియు అక్టోబర్ 1న జరుగుతున్న వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమాలకు హాజరుకావాలని మంత్రి నిరంజన్ రెడ్డిని ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కటకం పెంటయ్య, కైలాస హరినాథ్, గౌరీశెట్టి శ్రీనివాస్, లింగారెడ్డి, సురేందర్, శ్రీధర్, మధుకర్ పాల్గొన్నారు

డీఆర్వీఎస్ ఆధ్వర్యంలో నిత్యన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ - మట్టెవాడ



గణపతి నవరాత్రి ఉత్సవా లలో భాగంగా మంగళవారం నుండి మహా అన్నదాన కార్య క్రమం ఉత్సవాలు ముగిసే వరకు కొనసాగుతాయని దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం శాశ్వత అధ్యక్షులు ఆడెపు రవీందర్ అన్నారు. దాతల సహకారంతో వినాయక చవితి ఉత్సవాలలో నిత్య అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ఎంతో భక్తి శ్రద్ధలతో కొనసాగిస్తున్నామని కోరిన కోరికలు గణపతి తీర్చడంతో పాటు పేద ప్రజలకు కడుపు నింపడం కోసం పలువురు దాతలు అన్నదాన కార్యక్రమానికి ముందుకు వస్తున్నారని దాతల సహకారంతో ఉత్సవాలు ముగిసే వరకు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాన్ని వర్తక సంఘం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులందరం కలిసి ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ వి ఎస్ జిల్లా కార్యదర్శి వి విజయ భాస్కర్ రెడ్డి, కోశాధికారి , శిరూప మదన్ కుమార్, మార్గం నాగరాజు, కనుగంటి అశోక్, ప్రవీణ్ పాల్గొన్నారు.

శాంతిసంఘం ఆధ్వర్యంలో సన్మానం

నవతెలంగాణ - హన్మకొండ



లయన్స్ క్లబ్ హన్మకొండ అధ్యక్షుడిగా ఎన్నికైన సయ్యద్ సర్ఫరాజుద్దీన్‌ను శాంతి సంఘం సభ్యులు మంగళవారం హన్మకొండ ఐడియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శాంతి సంఘం అధ్యక్షుడు అనిష్ సిద్ధికి, సెక్రటరీ సయ్యద్ ఇక్బాల్ మొహియుద్దీన్, కౌసర్ ఫరూఖీ, నయిమ్, నదీమ్ బేగ్, సయ్యద్ ఫెరోజ్, ఉపాధ్యాయులు ఖాజాపాషా, ప్రవీణ్, స్వామి, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలే మహిళా సాధికారతకు సాధ్యం





మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

నవతెలంగాణ-సంగెం

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని డిఆర్డిఓ సంపత్ రావు అన్నారు. మంగళవారం కాపులకనపర్తి గ్రామంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సౌజన్యంతో లయన్స్ క్లబ్ హనుమకొండ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం ముగింపు సభలో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు.ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కుట్టు శిక్షణ నేర్చుకున్న ప్రతి మహిళ గౌరవంగా ఇంట్లోనే టైలరింగ్ పనులు చేసుకొని ఉపాధి పొందవచ్చని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని వివరించారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చొరవతో కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కులో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తు న్నారన్నారు. కాపులకనపర్తి గ్రామంలోసెర్ప్ సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ 3 నెలలుగా 27 మంది మహిళలు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు.అనంతరం మూడు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న 17 మందికి ఉచిత కుట్టు మిషన్లు లయన్స్ క్లబ్, గవర్నర్ ఎన్ వెంకటేశ్వరరావు, డిఆర్డిఓ సంపత్ రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ చందర్ రావు, లయన్స్ అధ్యక్షుడు సయ్యద్ సర్ఫరాజ్ ఉద్దీన్, కార్యదర్శి వినోద్ ఆనంద్, కోశాధికారి రమేష్ బాబు, సెర్ప్ ఏపీఎండి కిషన్, సీసీలు, సురేశ్, స్వరూప రాణి, రాజయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు మురళీధర్ రావు, అశోక్, రమణారెడ్డి, ప్రకాష్, పురుషోత్తం, సుధాకర్ రావు, మహేందర్ రెడ్డి ,రామయ్య,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలుగా పాపమ్మ

నవతెలంగాణ - చెన్నారావుపేట

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయురాలుగా మునుపటి పాపమ్మ మంగళవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పాపమ్మ కాంప్లెక్స్ పరిధిలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాపమ్మ మాట్లాడుతూ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలుగా అదనపు బాధ్యతలు చేపట్టినందుకు సంతోషంగా ఉందన్నారు. పాఠశాలను ప్రైవేటు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్ది, సర్వతో ముఖాభివద్ధికి కషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిని, రవి, కిషోర్, శ్రీనివాసరెడ్డి, మల్లయ్య ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

వేళా పాళా లేని కరెంటు కోతలు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు,పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని చింత నెక్కొండ సబ్‌స్టేషన్‌లో వేళా పాళా లేకుండా కరెంటు కోతలు విధిస్తున్నారు .దీంతో స్థానిక ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు.నిత్యం ఇలానే జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.పగలు రాత్రుళ్ళు అని చూడకుండా ట్రిప్ ల పేరుతో వ్యక్తిగత ఎల్సీ లు ఇచ్చుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీంతో వద్ధులు,పిల్లలు దోమల బాధ తట్టుకోలేక పోతున్నామని వాపోతున్నారు.అలాగే రాత్రుళ్ళు కరెంట్ కట్ చేయడం తో క్రిమి కీటకాల భయం కలుగుతుందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇక విద్యుత్ సిబ్బంది విషయానికొస్తే సంబంధిత లైన్ మెన్,లైన్ ఇన్స్పెక్టర్ లు అందు బాటులో లేకుండా తాము ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ వారానికి ఒకటి రెండు సార్లు చుట్టపు చూపుగా వస్తున్నారని పలువురు చెబుతున్నారు.మండలం లో మొత్తం ఏడు సబ్ స్టేషన్ లు వున్నాయని ఏ సబ్ స్టేషన్ లో కూడా పూర్తి స్థాయిలో సిబ్బంది లేక ప్రైవేటు వ్యక్తులతో విద్యుత్ మరమ్మతులు చేయిస్తూ ఎప్పుడు పడితే అప్పుడు కరెంటు కోతలు విధిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చింతనెక్కొండ గ్రామంలో విద్యుత్ కోతలతో రోజుకు పదిసార్లు ఆన్ ఆఫ్ లు చేయడం తో ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఫ్యాన్లు,ఫ్రిజ్ లు,టివి లు తదితర వస్తువులు కాలిపోతున్నా యని బాధితులు వాపోతున్నారు.అధికారుల కు పలుమార్లు చెప్పినా ఫలితం శూన్యం మని,ఇందుకు ప్రధాన కారణం విద్యుత్ అధికారుల పర్యవేక్షణ లోపమే కాక బాధ్యతలను సక్రమంగా అమలు లేకపోవడం తో మండలం లోని ఆయా గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అలాగే గ్రామాల్లో కొక్కాలు తగిలించుకుని విద్యుత్ అపహరణ చేస్తున్న సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపించారు.ఇట్టి విషయం పై సంబంధిత పర్వతగిరి ఏ డి ఈ చంద్రమౌళి ని నవతెలంగాణ వివరణ కోరగా గ్రామాల్లో విద్యుత్ కొక్కాలు తగిలించి అపహరణ చేయకుండా అట్టివారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధిత కుటుంబాలకు జీఎస్ఆర్ పరామర్శ



నవతెలంగాణ - శాయంపేట

మండలంలోని నేరేడుపల్లె గ్రామానికి చెందిన పరికిరాల భూమయ్య, శాయంపేటకు చెందిన రేనుకుంట్ల ఉప్పలమ్మ, బగ్గీ నరేందర్, మైలారంలో అరికిల్ల శ్రీధర్ ఇటీవల మరణించారు. బాధిత కుటుంబాలను మంగళవారం టీపీసీసీ సభ్యులు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం శ్రీధర్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మారపల్లి కట్టయ్య, మండల ప్రధాన కార్యదర్శి చిందం రవి, నాయకులు పత్తి శీను, మారపల్లి రాజేందర్ ఉన్నారు.

మాదిగల చిరకాల కోరిక వర్గీకరణ



నవతెలంగాణ - హన్మకొండ

ఈ నెల 22 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలనే చిరకాల వాంఛను వెంటనే తీర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఇల్లందుల రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. 1997 నుండి ఎస్సీ వర్గీకరణ కోసం బిజెపి మద్దతిచ్చి చట్టసభల్లో అనుకూలంగా మాట్లాడిందన్నారు. అధికారంలో వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించిన బీజేపీ హామీని విస్మరించిందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటు సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడ స్వామి జిల్లా ఉపాధ్యక్షులు, జన్ను సంజీవ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోగుల రాకేష్, ఖాజీపేట్ మండల అధ్యక్షులు కొడవటి తిరుపతి ,అనిల్ కుమార్, వెంకన్న, రమేష్ రాజు పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షలు @ 22వ రోజు

నవతెలంగాణ-హన్మకొండ

తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 22వ రోజుకు చేరుకున్నాయి. హనుమకొండలోని ఏకశిల పార్క్ ధర్నా చౌక్ వద్ద.. వరంగల్, హనుమకొండ జిల్లాల సమగ్ర శిక్ష ఉద్యోగులు తమను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగాల క్రమ బద్ధీకరణకు ప్రభుత్వానికి సమయం పడుతుందనుకుంటే 26 వేల మందికి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో, స్లోగన్లతో, ఆవేదనతో నినాదాలు చేశారు. తక్షణమే తమ న్యాయమైన కోరికలు ప్రభుత్వం తీర్చాలని కోరారు. లేదంటే ఉద్యమాన్ని ఉధతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ, వరంగల్ జిల్లాల సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మొగిలిచర్ల శ్రీనివాస్, శశిధర్, సమగ్ర శిక్ష ఉద్యోగులు డిపిఓ కార్యాలయం సిబ్బంది రాజు, శ్రీకాంత్, రఘు, శ్యామ్, గీతా దత్, ఉద్యోగులు రాజు, అజయ్, షఫి, రాంప్రసాద్ , ప్రవీణ్ , సుద్దాల ఆనందం, శ్రీధర్ గౌడ్, మనోజ, ఉమ, రనోపా,రాజమణి,పబ్బు రాజు హిమ సాగర్, రాజన్ నాయక్, మహేందర్, రేణుక తదితరులు పాల్గొన్నారు.



మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలి

నవతెలంగాణ-సుబేదారి

మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలని పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలలో ఉన్న ఖాళీగా ఉన్న లక్ష 7వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని హనుమకొండ కలెక్టర్ ఆఫీస్ ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న లక్షా ఏడువేల ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని అలాగే రాష్ట్ర ప్రభుత్వం, ఉపాధ్యాయ పోస్టులకు ఐదువేల పోస్టులు మాత్రమే ప్రకటించిందని మొత్తం 2 వేల పైగానే ఉన్నాయని అన్నింటిని కలిపి మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. తొమ్మిది సంవత్సరాలుగా కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేస్తానని ప్రగల్ బాలు పలికిందని ఇంటికో ఉద్యోగం ఏమో గాని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలో నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. ఎన్ని ఉద్యోగాలు నిరుద్యోగులకు అందించిందో భర్తీ చేసిందో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం హనుమకొండ డిఆర్‌ఓకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనసరి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు సుమన్ ,సహాయ కార్యదర్శి హరిబాబు, జిల్లా నాయకులు కే రంజిత్ , పి అశోక్, రవి కుమార్ ,పి నాగరాజు, బి కుమార్, సక్రు తోపాటు మద్దతుగా న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు పాల్గొన్నారు..



భూమయ్యకు సిరికొండ పరామర్శ

నవతెలంగాణ - శాయంపేట

మండలంలోని నేరేడుపల్లె గ్రామానికి చెందిన ఎంసిపిఐ (యు) రాష్ట్ర కమిటీ సభ్యుడు పరికరాల భూమయ్య గుండెపోటుతో బాధపడుతూ ఇటీవల మరణించాడు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ యువజన రాష్ట్ర నాయకుడు సిరికొండ ప్రశాంత్ సందర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాట్రపల్లిలో బలిజ సాంబయ్య, పత్తిపాకలో పులుమాటి భాగ్యలక్ష్మి, శాయంపేటలో రేణిగుంట్ల ఉప్పలమ్మ, బగ్గి నరేందర్ ఇటీవల మరణించగా బాధిత కుటుంబాలను సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మాస్కుల నరసయ్యను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ కటకం రాజ్ కుమార్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎస్కే గౌస్, మాజీ సర్పంచ్ మంద రాజయ్య, నాయకులు జనగాని సత్యనారాయణ, మారపల్లి సుమన్, యువసేన నాయకులు బేర్గు రాకేష్, ప్రశాంత్, బలవంతుల కుమార్, సమ్మిరెడ్డి, పోశాలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ భూటకపు మాటలు నమ్మొద్దు

విజయ్ చందర్ రెడ్డి



నవతెలంగాణ-ఆత్మకూర్

బీఆర్ఎస్ భూటకపు మాటలను నమ్మవద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరకాల ఇంచార్జి పెసరు విజయచందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండలం నాగయ్య పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ ముఖ్య నాయకులు పోగుల యాదగిరి,కొన్నె రాజు ఆధ్వర్యంలో దాదాపు 30 మంది బీజేపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువా కప్పి స్వాగతించారు. అనంతరం విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ.... బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,నాయకుల మాయ మాటలునమ్మి మోసపోవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. బిఆర్ఎస్ దౌర్జన్యాలకు ఎదురు తిరిగి బిజెపిలోకి రావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో భూ కబ్జాలు,దోపిడీ, దౌర్జన్యాలు తప్ప చేసిన అభివద్ధి ఏమిటని ప్రశ్నించారు. దమ్ముంటే చేసిన అభివద్ధి నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్,మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం, ప్రధాన కార్యదర్శి ఉప్పుగళ్ల శ్రీకాంత్ రెడ్డి,జిల్లా నాయకులు శ్రవణ్, ఓబీసీ జిల్లా కార్యదర్శి రవి, బీజేవైఎం మండల అధ్యక్షులు పొరెడ్డి ప్రదీప్ రెడ్డి, మండల అధ్యక్షులు వెల్దే సదానందం, మండల కార్యదర్శులు రవ్వ శివప్రసాద్,బయ్య పైడి,జిట్ట మధు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఓటరు నమోదుపై అవగాహన సదస్సులు

జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్

నవతెలంగాణ-సుబేదారి

ఓటరు నమోదులో భాగంగా స్వీప్ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ తెలిపారు. ఐడీవోసీలో ఓటర్ నమోదు లో భాగంగా జిల్లా స్థాయి లో స్కిట్, పాటల పోటీలు, కవిత్వం పై పోటీలలో పాల్గొన్న చిన్నారులకు కలెక్టర్ బహుమతులను ప్రదానం చేసారు. ఈ నెల 19వ తేదీ ఓటరు నమోదుకు చివరి తేదీ అయినందున జిల్లా వ్యాప్తంగా ప్రచారాన్ని పలు కార్యక్రమాల ద్వారా నిర్వ హిస్తూ ఓటరుగా నమోదు కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఎన్నికల సంఘం వారు స్వీప్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో సృజనాత్మకత, కళాత్మకత విలువల్ని వెలికి తీస్తున్నామన్నారు. బావి భారత సమాజానికి యువత ఒక మైలు రాయి అని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఇప్పటికే జిల్లాలో అన్ని నియోజక



వర్గాలలో ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపట్టి ఓటు ఆవశ్యకత పై ప్రజలలో చైతన్యం కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీ ఆర్వో వై వి గణేష్, డీఈవో అబ్దుల్ హై, నోడల్ అధికారి హరిప్రసాద్ ,జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ పోరాట ఫలితమే మహిళా రిజర్వేషన్ బిల్లు

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల రమాదేవి

నవతెలంగాణ-హనుమకొండ

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ పోరాట ఫలితంగానే కేంద్రం దిగి వచ్చి మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తున్నదని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల రమాదేవి అన్నారు. హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ లో మంగళవారం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ ఉద్యమ నాయకురాలు గీతా ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం మహిళలకు స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా రాసమాల దీన అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ మాజీ పార్లమెంటు సభ్యురాలు గీతాముఖర్జీ 1996 సెప్టెంబర్ 12న పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టడం జరిగిందని,అప్పటి నుండి నేటి వరకు 27 సంవత్సరాలుగా గీతా ముఖర్జీతో పాటు అనేకమంది మహిళా నేతలు దేశవ్యాప్తంగా నిరసన గళాన్ని వినిపించడం జరుగుతున్న దన్నారు. ప్రభుత్వానికి దాని ఆవశ్యకత గురించి కోర్టు చెప్పడం జరిగిందని, అనేకమార్లు రెండు సభలలో అనేక అడ్డంకులు ఎదుర్కొని నేడు ఆమోద



పొందడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ విజయం పూర్తిగా మాజీ పార్లమెంట్ సభ్యురాలు గీతా ముఖర్జీకే దక్కుతుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ద్వారా జాయింట్ సెలెక్ట్ కమిటీ చైర్మన్‌గా గీతా ముఖర్జీ దేశవ్యాప్తంగా విస్తత ప్రచారం చేసి అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను సేకరించి పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టిందన్నారు. గీతా ముఖర్జీ సేవలు మరువలేవని, భారత జాతీయ మహిళా సమాఖ్య మహిళా లోకానికి అండగా నిలబడుతుందని అన్నారు. మహిళా సమస్యల పై నిరంతరం ఉద్యమించాలని, హక్కుల సాధన కోసం మహిళలు కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాస మల్ల దీన, మరియా, అంబాల లక్ష్మిసాపూరు పల్లవి, మాట్ల పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంజక్షన్ వికటించి రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ మృతి

బంధువుల ఆందోళనతో దిగొచ్చిన వైద్యాధికారులు

ఆస్పత్రిని తనిఖీ చేసిన పోలిస్, వైద్య, రెవెన్యూ అధికారులు

కాలం చెల్లిన శాంపిల్లను సేకరించి ఆస్పత్రి సీజ్

నవతెలంగాణ-హసన్‌పర్తి

ఇంజక్షన్ వికటించి వృద్ధుడు మృతి చెందిన ఘటన వినాయక చవితి పండుగ రోజు హసన్‌పర్తిలో సంచలనం రేపింది. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్‌కు రెండు ఇంజక్షన్‌లు వేయడంతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఇదే ఆసుపత్రి వైద్యుడు 108 అంబులెన్స్‌కి సమాచారం అందించి ఎంజీఎం తరలించగా రోగి మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు. సారయ్య మృతితో బంధువులు ఆందోళనకు గురయ్యారు. ఇంజక్షన్ వికటించి మృతి చెందిన ఘటనపై హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపికి ఫిర్యాదు చేయగా సంబంధిత వైద్యాధికారులతో విచారణ చేయించి ఆసుపత్రిని సీజ్ చేశారు. ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్‌మోహన్‌రెడ్డి, తహశీల్దారు చల్ల ప్రసాద్, మృతుని కుమారుడు రాజేంద్రప్రసాద్ కథనం ప్రకారం... మండలంలోని చింతగట్టు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ నద్దునూరి సారయ్య (63) అనారోగ్యంతో హసన్‌పర్తికి చెందిన డాక్టర్ సముద్రాల శంకర్ ఆసుపత్రికి చికిత్స కోసం తన భార్యతో కలిసి సోమవారం వచ్చారు. ఈ క్రమంలో సంబంధిత వైద్యుడు వైద్య పరీక్షలు నిర్వహించకుండానే రెండు ఇంజక్షన్‌లు ఇవ్వడంతో కొద్ది సేపటికే సారయ్య అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న వైద్యుడు శంకర్ వెంటనే అప్రమత్తమై 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి మెరుగైన వైద్య చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సారయ్య పరిస్థితి విషమించడంతో సంబంధిత డాక్టర్ శంకర్‌ను ఆసుపత్రిలో అందించిన చికిత్స వివరాలను నమోదు చేసేందుకు ప్రిస్క్రిప్షన్ ఇవ్వాలని కోరారు. దీంతో వైద్యుడు నిరాకరించడంతో బాదితుడి కుమారుడు రాజేందర్ కోపగించుకోవడంతో ఒక ఇంజక్షన్ ఇచ్చానని బుకాయించడంతో బాదితుడి భార్య మాత్రం తన భర్తకు రెండు ఇంజక్షన్‌లు ఇచ్చారని కొద్ది సేపటికే తన భర్త అపస్మారక స్థితికి చేరుకున్నట్లు ఆవేధన వ్యక్తం చేసింది. వెంటనే డాక్టర్ శంకర్ మాత్రం ఒక ఎవిల్ ఇంజక్షన్ మాత్రమే ఇచ్చినట్లు అంబులెన్స్ సిబ్బందికి తెలిపారు. అక్కడే ఉన్న మృతుడి కుమారుడు తన తండ్రికి ఏవిధమైన చికిత్స అందించారో తెలిపేందుకు ఎంజీఎంకు తనతో రావాలని కోరడంతో నిరాకరించిన వైద్యుడిపై దాడి చేసేందుకు కుటుంబ సభ్యుల యత్నించారు. వెంటనే సంబంధిత వైద్యుడు



అంబులెన్స్‌లో ఎంజీఎంకు బయలుదేరాడు. ఎంజీఎంకు సాయ్యకు మెరుగైన వైద్య చికిత్స చేసేందుకు చేర్పించడంతో అప్పటికే మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు. ఈ క్రమంలోనే అక్కడే ఉన్న డాక్టర్ శంకర్‌ను అతని కుమారుడు డాక్టర్ రవితేజ పారిపోయేందుకు సహకరించినట్లు మృతుని బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. సారయ్య మృతికి కారణమైన డాక్టర్ శంకర్, పారిపోయేందుకు సహకరించిన డాక్టర్ రవితేజతో పాటు ఆసుపత్రిలో కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్న ఫార్మసిస్టు శ్యామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు.

ఆసుపత్రి సీజ్

ఇంజక్షన్ వికటించి రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ సారయ్య మృతితో అప్రమత్తమైన ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు, డిస్ట్రిక్ట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్నకుమార్, తహశీల్దారు చల్ల ప్రసాద్ లు మంగళవారం డాక్టర్ సముద్రాల శంకర్ ఆసుపత్రిని సీజ్ చేశారు. సోమవారం ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్‌మోహన్, తహశీల్దారు చల్ల ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణిశ్రీ నేతృత్వంలో ఆస్పుత్రిలో తనిఖీలు చేశారు. ఆసుపత్రిని పరిశీలించి అందులో వైద్యుడు వాడిన సూది మందులతో పాటు ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. అపరిశుభ్రమైన వాతావరణంతో పాటు ఆసుపత్రిలో కాలం చెల్లిన సూదిమందులు, మెడిసిన్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఆసుపత్రిలో వాడిన కాలం చెల్లిన సూదిమందులు, మెడిసిన్ శాంపిళ్లను సేకరించి ఆసుపత్రిని సీజ్ చేశారు. ఈ తనిఖీలలో డాక్టర్ విజయ్‌రావు, డిప్యూటీ తహశీల్దారు మహ్మద్ రహీం, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రణయ్, ఎస్సై ఎండీ.వలీ, ఏఎస్సై జనార్ధన్, వైద్య సిబ్బంది కందుకూరి సంతోష్, ఇంద్రసేనారెడ్డి, నిర్మళతో సిబ్బంది ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన

నవతెలంగాణ-ఎల్కతుర్తి

రాబోయే సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకొని, తాసిల్దార్ జగత్ సింగ్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఓటర్



నమోదు కార్యక్రమం మంగళవారం చివరి రోజు అని తెలిపారు. గ్రామ గ్రామాన గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఈవీఎంలను ప్రజలకు చూపెట్టి ఎలా ఓటు వేయాలో తెలిపారు. ఏ పార్టీ నచ్చని వారు నోటాకు ఎలా వేయాలో కూడా తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

బీమారంలో గణపతి విగ్రహప్రతిష్ట

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



భీమారం, 55వ డివిజన్ చింత కింద గజానన మండలి ఆధ్వర్యంలో గణపతి దేవుని నవరాత్రి ఉత్సవ వేడుకల్లో భాగంగా ఘనంగా నిర్వహించిన గణపతి విగ్రహ ప్రతిష్ఠ పూజలో 55వ డివిజన్ కార్పొరేటర్ ముఖ్య అతిథిగా జక్కుల రజిత వెంకటేశ్వర్లు (శ్రీను)యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహదాత, పెద్దలు బూర వెంకటస్వామిలిబూర విజయ కుమార్ దంపతులు బూర సత్యనారయణ - బూరప్రకాష్ - బూర రామరాజు - బూర రాజేందర్ (బాబు)బూర నవీన్ - బూర రామకష్ణ (కిట్టు)- గుంజ కుమారస్వామి బూరశ్రీనాథ్శ్రీనాథ్- నరేష్ .తేజ భక్తులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య



నవతెలంగాణ - శాయంపేట

కూలి పని చేసుకుని జీవించే యువకుడు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆసుపత్రుల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.... మండలంలోనిపెద్దకోడపాక గ్రామానికి చెందిన మంద. తిరుపతి (39) ఉపాధి లేక పని నిమిత్తం హనుమకొండలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతనికి గత కొన్ని రోజుల నుండి అస్వస్థతగా ఉండడం, ఎముకలలో నీరు రావడంతో హాస్పిటల్‌లో చూపించిన కూడా నయం కాకపోవడంతో మనస్థాపం చెంది శుక్రవారం కూలి పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి స్వగ్రామం పెద్దకోడెపాక గ్రామానికి వచ్చి పురుగుల మందు సేవించాడు. ఇంటి పక్కన వారు చూసి హుటాహుటిన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించాడు. బాధితుని భార్య మంద.స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సు ఢీ కొని సైకిలిస్టు మృతి

నవతెలంగాణ-ఆత్మకూర్



గూడెప్పాడ్ నుండి ఆత్మకూరు వైపు వస్తుండగా గ్రామ సమీపంలో సైకిలిస్టును బస్సు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గూడెప్పాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామం నుంచి ఆత్మకూరుకు వెళ్లి వస్తానని చెప్పి సైకిల్ పై బయలుదేరిన మేక స్వామి రెడ్డి 60 సంవత్సరాలు వెనుక నుంచి బస్సు ఢీకొట్టడంతో రోడ్డుపై ఎగిరిపడ్డారు. తల పగిలి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మతి చెందారని గ్రామస్తులు తెలిపారు. మతుని సొంత గ్రామం గూడెప్పాడ్ కావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చి వరంగల్ ఎంజీఎం కు భౌతిక దేహాన్ని తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మహిళ సమస్యల పై నిరంతరం పోరాటాలు ఐద్వా

నవతెలంగాణ -హన్మకొండ

మహిళల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని అందుకు మహిళలు సిద్ధం కావాలని ఐద్వా హన్మకొండ సౌత్ మండల కార్యదర్శి సాంబరాజు శ్వేత పిలుపునిచ్చారు. మంగళవారం ఐద్వా హన్మకొండ సౌత్ మండల సమావేశం హంటర్ రోడ్డు లోని ఎమ్మార్ భవన్ లో జరిగింది. ముఖ్య అతిథిగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మంద సంపత్ హాజరై మాట్లాడుతూ ఎన్నికల ముందు మహిళలను అనేక వాగ్దానాలు ఇచ్చి కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో బీఆర్ఎస్ మోసగించాయని విమర్శించారు. మహిళా హక్కుల రక్షణ ,సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలన్నారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక దేశంలో మహిళలపై లైంగిక వేధింపులు పెరిగాయన్నారు. 2014 ముందు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ధరలు పెంచుతుందని గగ్గోలు పెట్టి అధికారంలోకి వచ్చిన బిజెపి అన్ని నిత్యవసర వస్తువుల ధరలను పెంచి సామాన్య మానవునికి అందుబాటులో లేకుండా చేసిందని అన్నారు. ధరలు పెరగడం వల్ల అనేకమంది మహిళలు పోషక పదార్థాలు తినక జబ్బుల బారిన పడి మరణిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగాన్ని మొత్తాన్ని ప్రైవేటు వాళ్లకు అప్పజెప్పితే ఉన్న ఉద్యోగాలనే పీకేస్తున్నారని ఆందోళన వెలిగించారు. 80 కోట్ల నల్లధనాన్ని తెచ్చి పేదల జన్ ,ధన్ ఖాతాలో వేస్తానని చెప్పిన మోడీ ఒక్క రూపాయి కూడా నల్లధనాన్ని గుర్తించలేదన్నారు. పేదల ఖాతాలో ఒక్క రూపాయి కూడా వేయలేదు అన్నారు. 2020 నాటికి పేదలందరికీ ఆవాస్ యోజన కింద ఇల్లు కట్టిస్తానని చెప్పిన మోడీ ఎక్కడ ఒక ఇల్లు కూడా మంజూరు చేయలేదని ఆమె అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు,వేధింపులు, పెరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ముందున్న ఎన్నికల్లో మహిలందరు ఈ ప్రభుత్వలకు బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాకిడే రాణి, బుడిద రాధ, చెరుకు రాణి, కంచర్ల రజిత, జోగు దుర్గ, ఓర్సు నవ్య, శివరాత్రి శారదా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అశోక్

నవతెలంగాణ - శాయంపేట



మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రం అశోక్ ను పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర వెంకట రమణారెడ్డి, వరంగల్ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్, భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ లకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. గండ్ర దంపతులు చేస్తున్న అభివద్ధి పనులను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనూ ప్రజల్లోకి తీసుకెళ్తు మరో మారు బిఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించే దిశగా పనిచేస్తానని తెలిపారు. మండలంలో బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసికట్టుగా ముందుకు సాగుతానని తెలియజేశారు. నాపై నమ్మకంతో నా ఎన్నికకు సహకరించిన ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి, మండల ప్రజాప్రతినిధులకు, అన్ని గ్రామాల సర్పంచులకు, ఎంపీటీసీలకు , బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులకు, యూత్ కమిటీ నాయకులకు గండ్ర దంపతుల అభిమానులకు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.



నేడు నూతన వ్యవసాయ కమిటీ చైర్మెన్‌గా

నిప్పాని హైమావతి ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-పరకాల

వ్యవసాయ మార్కెట్ చరిత్రలో నూతనంగా మొట్టమొదటి మహిళ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నెప్పని హైమావతి సత్యనారాయణ బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. గత పాలకవర్గం పదవి కాలం ముగియడంతో స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నూతన వ్యవసాయ కమిటీ పాలకవర్గాన్ని నియమించారు. అందులో కమిటీ చైర్మన్గా నిప్పని హైమావతి సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా వీర్ల పావ, బాపురావు, తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.

పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ గా నందం

నవతెలంగాణ - శాయంపేట

శాయంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారపల్లి నందం రెండవసారి పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా నియమితులు అయ్యారు. ఎమ్మెల్యే గండ్ర అనుచరడిగా గుర్తింపు పొందిన నందం 1992లో పిఏసిఎస్ డైరెక్టర్గా, 2006లో శాయంపేట సర్పంచిగా, 2021లో ఏఎంసి వైస్ చైర్మన్ గా పనిచేశారు. మరల పరకాల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఎన్నికల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సహకారంతో రెండవసారి వైస్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు.

సాయి ప్రియకు జిల్లాస్థాయి తృతీయ బహుమతి

నవతెలంగాణ - శాయంపేట



జిల్లా సాంఘిక శాస్త్ర ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వీప్ జిల్లా స్థాయి పాటలు, పద్యాల .పోటీలలో శాయంపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి సాయి ప్రియ తృతీయ స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో గెలిచిన సాయి ప్రియ మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ చేతుల మీదుగా మెమొంటో, ప్రశంసా పత్రాన్ని అందుకుంది. సాయి ప్రియను ఇన్చార్జి టీచర్ కరుణ, మండల నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, ఎంఈఓ రమాదేవి, హెచ్ ఎం శ్రీలత అభినందించారు.

మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ శివలింగయ్య



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఈ నెల 20న జిల్లాలోని పాలకుర్తి మండల కేంద్రంలో నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పాలకుర్తి బృందావన్ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో 13వేల ఉద్యోగాల భర్తీ కోసం 80 కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దయాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళాకు 10వ తరగతి ఆ పై చదువుకున్న విద్యార్థులు సంబంధిత ధృవీకరణ పత్రాలు వెంట తీసుకొని ఉదయం 9 గంటలకు చేరుకోవాలని ఆయన కోరారు.

ఎంబీబీఎస్ విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-జనగామ

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థులు బ్యూలా, మానసలను అంబేద్కర్ లిస్టులు ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ పూలే అధ్యయన కేంద్రంలో ఉపాధ్యాయులు చింత యాదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ వంశీ, డాక్టర్ మనస్వినిలు పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తులో సమాజం కోసం పనిచేస్తూ ప్రజా వైద్యులుగా పేరు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాభిమానులు, వివిధ సంఘాల నాయకులు, అంబేద్కర్ రిస్టులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

మంత్రి ఎర్రబెల్లి చొరవతో బ్రిడ్జి నిర్మాణ పనులు



నవతెలంగాణ-పాలకుర్తి

శాతాపురం, దుబ్బ తండ (ఎస్సీ) గ్రామాల ప్రజల కల నెరవేరింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కృషితో 12 సంవత్సరాల నిరీక్షణకు తెరపడింది. స్టేషన్ ఘన్పూర్ నుండి మండలంలోని చెన్నూరు రిజర్వాయర్‌కు వెళ్లే జే చొక్కా రావు దేవాదుల ప్రధాన వరద కాలువ తవ్వకాల్లో శాతాపురం, దుబ్బ తండా (ఎస్సీ) గ్రామాలతో పాటు ఆవాస తండాలకు బ్రిడ్జి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శాతాపురం రైతులు వ్యవసాయ పనులకు వెళ్లాలన్న, దుబ్బతండా ఎస్సీ తోపాటు లోతువర్రెతండా, కేవులతండా ప్రజలు అత్యవసరాలకు పట్టణ ప్రాంతాలకు వెళ్లాలన్న సుమారు కిలోమీటర్ నడవాల్సిన పరిస్థితితో ప్రజలు ఇబ్బందులు పడేవారు. బ్రిడ్జి నిర్మాణం కోసం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ప్రజలు పలు మార్లు కలిసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని విన్నవించుకున్నారు. స్పందించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కాంట్రాక్టర్ సుమన్ రావుకు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించడంతో పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు చివరి దశకు చేరడంతో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు, తండావాసులు మంత్రి ఎర్రబెల్లికి కృతజ్ఞతలు తెలిపారు.

గీత కార్మికుడికి కాంగ్రెస్ 50 వేల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ఇటీవల వృత్తి నిర్వహణలో భాగంగా తాటి చెట్టుపై నుండి పడడంతో వెన్నుపూసకు తీవ్ర గాయమైన జనగామ నియోజకవర్గంలోని పసరమడ్ల గ్రామానికి చెందిన కుర్రెముల శివకుమార్ గౌడ్‌కు టిపిసిసి ఉపాధ్యక్షులు రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం శివకుమార్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికంగా చేయూతనిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గంగరబోయిన మల్లేశం, పిఎసిఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, ఎంపిటిసి మహేందర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు అభిగౌడ్, వేమళ్ళ సత్యనారాయణరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

6 పథకాలతో అధికాం మాదే : కాంగ్రెస్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

కాంగ్రెస్ ఇచ్చిన 6 హామీలతో రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి వస్తున్నామని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడి కె ఇందిర అన్నారు. మంగళవారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌కే సాధ్యమన్నారు. గృహలక్ష్మి పేరుతో ప్రతి కుటుంబానికి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో పాటు తుక్కుగూడలో పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. ఇప్పటికే తాము ఈవిషయమై ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నామని, త్వరలో పార్టీకి చెందిన యువత, మహిళలు, నాయకులు, కార్యకర్తలందరం ప్రజా క్షేత్రంలో ఉండేందుకు పథక రచన చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షులు కొన్నె మహేందర్‌రెడ్డి, నాయకులు చింతకింది మల్లేశం, లోక్కుంట్ల ప్రవీన్, ఎన్ఎస్‌యుఐ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జక్కుల వేణుమాధవ్, మీడియా ఇంచార్జి మాజిద్, కట్ట కృష్ణ, ఎంపిటిసి సలేంద్రి మహేశ్వరి శ్రీనివాస్, జిల్లా నాయకులు మల్లారం రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజక వర్గ ఇంచార్జీ సింగపురం ఇందిర



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఏఐసీసీ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని సముద్రాల గ్రామంలో సిడబ్ల్యుసి శాశ్వత ఆహ్వానితులు గిరీష్ చొడనకర్, ఏఐసిసి సభ్యులు బసిద్‌తో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజక వర్గ ఇంచార్జీ సింగపురం ఇందిర ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోనియా గాంధీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను ప్రజల మధ్య చర్చ జరిగే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని వివరించారు.రాష్ట్రప్రజల అభివృద్ధే లక్ష్యంగా, తెలంగాణ ప్రజల పక్షాన నిలిచి ఇచ్చిన హామీలు తప్పక అమలు అవుతాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలోనే అత్యుత్తమ స్థానంలో రాష్ట్రం నిలబడుతుందన్నారు. ప్రజల అభివృద్ధి కోసమే సోనియా స్వరాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రజలను అభివృద్ధి చేయడం రాష్ట్రం ఇచ్చిన వాళ్లగా కాంగ్రెస్ పార్టీకి బాధ్యత ఉందన్నారు. కాంగ్రెస్‌కు అండగా ప్రజలు నిలబడాలని, అధికారంలోకి తేవాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల అధ్యక్షుడు శిరీష్ రెడ్డి, డైరెక్టర్ చింత ఎల్లయ్య, యూత్ నాయకులు బస్వగాని అనిల్ కుమార్, సర్పంచ్ గుండె విమలనర్సయ్య, మహిళా అధ్యక్షురాలు చింత జ్యోత్స్న, యూత్ నాయకులు శ్రీనివాస్, వసంత్, మధు, రాజ్ కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

నవతెలంగాణ-దేవరుప్పుల

ఈ పార్లమెంట్ సమావేశంలో బిజెపి ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఎస్సీ ఉపకులాలకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బస్వ మల్లేశం గౌడ్ ఎమ్మార్పీఎస్ మండల కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులకు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సంఘీభావం తెలుపుతూ మద్దతు పలికారు. ఈ సందర్భంగా బస్వ మల్లేశం మాట్లాడుతూ ఏండ్లు గడిచిన ప్రభుత్వాలు మారిన ఇప్పటి వరకు ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకపోవడం సిగ్గుచేటని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సెప్టెంబర్ 19 నుండి 22 వ తేదీ వరకు జరిగే పార్లమెంటు సమావేశాలలో ఏబిసిడి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొంగరి రాములు, గొడుగు మల్లికార్జున్, జేరిపోతుల కిష్టయ్య, వార్డు సభ్యులు, తెలంగాణ ఉద్యమకారుడు చింత పరిశురాములు, ఉప్పుల నర్సయ్య, ఉప్పుల రవి,జోగు జానీ, మనుగూరు మల్లయ్య పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మక నిర్ణయం

నవతెలంగాణ-దేవరుప్పుల

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్ ఒక చారిత్రాత్మక నిర్ణయమని బిజెపి నాయకురాలు దుబ్బ ప్రసన్నలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడుతూ మహిళలపై భారతీయ జనతా పార్టీకి ఉన్న గౌరవము చిత్త శుద్ధి దేశంలోని మహిళలు సాధికారిక సాధించాలన్న నరేంద్ర మోడీ లక్ష్యానికి అడుగులు వేస్తూ నిన్న కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయానికి దేశంలోని ప్రజల అందరి తరపున నరేంద్ర మోడీ గారికి ధన్యవాదాలు తెలిపారు.భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ గడిచిన 10 సంవత్సరాలలో ముఖ్యమైన క్యాబినెట్ హోదా పదవులిస్తూ ముందుకెళుతూ ఉందని,రాబోయే రోజులలో ఈ మహిళా రిజర్వేషన్ బిల్ ద్వారా దేశంలోని రాజకీయాలలో సంచలనాత్మకమైన మార్పులు దేశాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఉంటాయన్నారు.

అధికారంలోకి వస్తాం - హామీలన్నీ నెరవేరుస్తాం

సుప్రియ శ్రీనటే



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తోందని, ఇటీవల టిపిసిసి ఆధ్వర్యంలో హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడలో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని ఆ పార్టీ అఖిల భారత సోషల్, డిజిటల్ ఫ్లాట్ ఫాం చైర్మెన్ సుప్రియ శ్రీనటే తెలిపారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు, పిసిసి సభ్యులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కర్నాటక ఎన్నికల సమయంలో 5 హామీలను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అక్కడ అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన విధంగానే తెలంగాణలో అధికారంలోకి రాగానే ఇక్కడి ప్రజలకు ఇచ్చిన 6 హామీలను నెరవేరుస్తామని చెప్పారు. తెలంగాణలోని మహిళలకు గృహలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ. 2 వేలు, అలాగే ఆర్టీసి బస్సుల్లో వారికి ఉచిత ప్రయాణం, గృహ జ్యోతి పథకం కింద ప్రత ఇంటికి నెలకు 200 యూనిట్ల విద్యుత్ సరఫరాతో పాటు రూ.5 వందలకే గ్యాస్ లిండర్‌ను అందిస్తామని, రైతు భరోసా కింద ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు, కౌలు రైతులకు కూడా అదే స్థాయిలో ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా గృహ నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం, యువ వికాసం ద్వారా విద్యార్థులకు రూ.5 లక్షలతో విద్యా భరోసా కార్డులను అందిస్తామని, చేయూత పెన్షన్ పథకం ద్వారా నెలకు రూ.4 వేలు ఇస్తామని వివరించారు. అనంతరం పట్టణంలోని 11, 12 వార్డుల పరిధిలోని వీవర్స్ కాలనీలో పార్టీ కాంటెస్ట్ అభ్యర్థులు శ్రీరాం శ్రీనివాస్, బొంతపల్లి నాగరాజులతో కలిసి గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర కో-ఆర్డినేటర్ నవీన్ పెట్టం, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిట్టల సతీస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్ సీనియర్ నాయకులు నర్సింగరావు, మాజీ ఎంపిపి ధర్మగోవర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ సత్యనారాయణరెడ్డి, లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి ఆలేటి సిద్దిరాములు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను విజయవంతం చేయాలి : కలెక్టర్



నవతెలంగాణ-పాలకుర్తి

నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సహకారంతో రాష్ట్ర ప్రభుత్వంచేపట్టిన జాబ్ మేళాను విజయవంతం చేయాలని కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య ప్రజా ప్రతి నిధులను,అధికారులను ఆదేశించారు.మంగళవారం మండల కేంద్రంలోగల బృం దావన్ గార్డెన్‌ను జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌తో కలిసి ఆయన సందర్శించి జాబ్ మేళా ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ పాలకుర్తిలో గల యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. 13 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 80 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటారని తెలిపారు. ప్రజాప్రతి నిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి జాబ్ మేళాను విజయవంతం చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డిఆర్డి ఓ రామ్ రెడ్డి, ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జెడ్పి ఫ్లోర్ లీడర్ పుష్కరి శ్రీనివాసరావు, డిపిఓ రంగాచారి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, సర్పంచు వీరమనేని యాకాంతరావు, జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఎండి మదర్, ఐలమ్మ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముస్కు రాంబాబు, ఏపీఎం లు నరేందర్, రాచకొండ రమణాచారి పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై ఉద్యమాలు చేపట్టాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి



నవతెలంగాణ-లింగాలగణపురం

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై సర్వేలు నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పార్టీ కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం గోసంగి శంకరయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయని విమర్శించారు.నిత్యవసర, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై బారాలు మోపారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్ళీ గెలవాలని ప్రజలను మోసం చేసే పద్ధతుల్లో ప్రకటనలు చేస్తూ రాజకీయ పబ్బం గడిపే బిజెపి, బీఆర్ఎస్ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. గ్రామాలలో స్థానికంగా అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పేరుకుపోయిన స్థానిక సమస్యలపై సర్వేలు చేసి ఆ సమస్యల పరిష్కారం కోసం స్థానిక పోరాటాలు చేపట్టాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈ సందర్భంగా సీపీఎం మండల బాధ్యుడిగా తూటి దేవదానం ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు శాఖ కార్యదర్శులు రాపోలు సమ్మయ్య, గైన బిక్షం గౌడ్, మబ్బు ఉప్పలయ్య, మబ్బు వెంకటేష్, చెన్నూరు ఉప్పలయ్య, పాలమాకుల భాస్కర్, గండి అంజయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కోశాధికారి సుంచు విజేందర్



నవతెలంగాణ-జనగామ

మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి సుంచు విజేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయు) ఆధ్వర్యంలో మంగళవారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయేందర్ మాట్లాడుతూ 28 నుండి కార్మికుల సమ్మెబాట పట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టే నిర్వాహకుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.గత కొన్ని సంవత్సరాలుగా సమస్యలు పరిష్కరించాలని అనేక ఆందోళన, పోరాటాలు నిర్వహించినా రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేదని మండిపడారు. ప్రభుత్వం పెంచిన రెండు వేల రూపాయలు సంవత్సరం గడిచినా చెల్లించలేదన్నారు. ఒక వైపు రోజు రోజుకి నిత్యావసర సరుకులు, కూరగాయలు ధరలు ఆకాశాన్ని అంటుతుంటే, ప్రభుత్వం చెల్లించే బిల్లులు సరిపోవడం లేదన్నారు.పెరిగిన వేతనాలు, పెండింగ్ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలను అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. కొత్త మెనూకు నిధులు వెంటనే కేటాయించాలన్నారు. కోడి గుడ్డును ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వంట పాత్రలతో పాటు హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 27లోపు మా సమస్యలు పరిష్కరం చేయకపోతే 28 నుండి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెబాట పడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వాన్నిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు గంధం వల్ల ఆదిలక్ష్మి, ఎల్లమ్మ రాణి, లీల, నజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే విషం కక్కుతున్నారు : పాగాల సంపత్



నవతెలంగాణ-జనగామ

తెలంగాణలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే బిజెపి కాంగ్రెస్ పార్టీలు విషయ కక్కుతున్నాయని జడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి అన్నారు. మంగళవారం బీఆర్ఎస్‌ార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం అనేక అభివృద్ధి పనులు నిర్వహిస్తుంటే సీఎం కేసీఆర్ పై విమర్శలు చేయడం అవివేకం అన్నారు. కాంగ్రెస్ బిజెపి పాలిత రాష్ట్రాల్లో అమల్లో లేని పలు అభివృద్ధి పథకాలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పేరిట బిజెపి,17నిర్వహించిన కాంగ్రెస్ సభలో ఆయా పార్టీల అధినేతలు ఎటు పాలు పోక సీఎం కేసీఆర్ ను విమర్శించారన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా ఉంది అన్నారు. గత కాంగ్రెస్ బిజెపి పాలనలోనే దేశంలో పలు కుంభకోణాలు జరిగాయన్నారు. బిజెపి కాంగ్రెస్ పార్టీలు కక్ష సాధింపు ధోరణితో సీఎం కేసీఆర్ పై విషం కక్కుతున్నారని విమర్శించారు.తెలంగాణలో సీఎంకేసీఆర్‌పై ప్రజలకు నమ్మకం ఉందన్నారు. మూడోసారి ముచ్చటగా కెసిఆర్‌ను సీఎం చేసి ప్రజల హ్యాట్రిక్ కొట్టనున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి అభ్యర్థులు డిపాజిట్ గల్లంతవుతుందన్నారు. కాంగ్రెస్‌లోనే కుమ్ములాటలతో సరిపెట్టుకుంటుందన్నారు. అభివృద్ధికి సోపాన బాటలు వేస్తున్న సీఎం కేసీఆర్‌ను విమర్శిస్తే ప్రజలు సహించరని, తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ పి జమున, మున్సిపల్ కౌన్సిలర్లు బండ పద్మ, పగిడిపాటు సుధా, వాంకుడోత్ అనిత, జనగామ ఎంపీపీ మేకల కలింగరాజు, జెడ్పిటిసి నిమ్మతి దీపిక, రఘునాథ్‌పల్లి మండలం టిఆర్ఎస్ అధ్యక్షుడు వారాల రమేష్, జనగామ మాజీ ఎంపీపీ యాదగిరి, నాయకులు సిరివెల్లి లింగం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఓటు హక్కు వినియోగం, ఓటు హక్కు నమోదుపై మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారధుల బృందంచే ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సాంస్కృతి సారథి సభ్యులు పి. సాంబయ్య, ముక్కెర సంపత్, బాలయ్య, బి. రవి, తిప్పర్తి శ్రీనివాస్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

కడియం లక్ష ఓట్లతో విజయం సాధించాలని మొక్కు

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ లక్ష ఓట్ల మెజారిటీతో విజయం సాధించాలని చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర ఆలయ కొండపై చిల్పూర్ సర్పంచ్ ఉద్దేమారి రాజ్ కుమార్ గండ దీపం వెలిగించి మొక్కు చెల్లించారు.కార్యక్రమంలోలింగయ్యసునయ్,రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను జయప్రదం చేయండి

నవతెలంగాణ-దేవరుప్పుల

మండల కేంద్రంలో నిర్వహించే మెగా జాబ్ మేళాను జయప్రదం చేయాలని నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు గడ్డం రాజు ,మండల యూత్ అధ్యక్షుడు బానోత్ నవీన్ పిలుపునిచ్చారు. మండల బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం మండలఅధ్యక్షుడు పందేనబోయిన మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో గడ్డం రాజు, నవీన్నా నాయక్ మాట్లాడుతూ నేడు పాలకుర్తిలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా నియోజకవర్గ కోఆర్డినేటర్ గుండె రమేష్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు దాసగాని భరత్ గౌడ్,మండల యూత్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ యాకూబ్ పాషా,మండల యువజన నాయకులు పానుగంటి కృష్ణ, మేడా రామ్ దయాకర్, అంబాల యాకన్న, నీలారపు శ్రీకాంత్, జోగు ప్రదీప్,కారుపోతుల వెంకటేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలంలోని నెల్లుట్ల గ్రామ సమీపంలో జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన ఎదునూరి నర్సింహారెడ్డికి (55) తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా మంగళవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దొరల ఆధిపత్య పార్టీలను అంతం చేస్తాం

బీఎస్పీ మహిళ జిల్లా కన్వీనర్ గుగులోత్ పార్వతి రమేష్ నాయక్

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాద్ జిల్లా నియోజకవర్గంలో దొరల అధిపత్య పార్టీలను అంతం చేసి బహుజనులకు రాజ్యాధికారం తెస్తామని బహుజన్ సమాజ్ పార్టీ మహబూబాబాద్ జిల్లా మహిళ కన్వీనర్ గుగులోత్ పార్వతి రమేష్ నాయక్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో బీఎస్పీ మొదటి పది హామీల గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం పార్వతి రమేష్ నాయక్ మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గం తరతరాలుగా దొరలు, వారి బినామీ పాలకులే పరిపాలనలో ఉంటున్నారని అధికారంలో పార్టీలు మారుతున్నాయే తప్ప దొరలు, దొరల బినామీ పాలకులు మారడంలేదని వారి అధిపత్యంలో బహుజనులు బంధీంపబడి ఎలాంటి అభివృద్ధి నోచుకోకుండ తీవ్ర వివక్షకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌లు తేజావత్ అభినాయక్, ఎల్.విజయ్ కాంత్, జిల్లా ఉపాధ్యక్షులు తగరం నాగన్న, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐతం ఉపేందర్, జిల్లా కార్యదర్శి, డోర్నకల్ అసెంబ్లీ ఇంచార్జ్ ఐనాల పరశురాములు, జిల్లా ఇసి మెంబర్ ఎడ్ల శ్రీను, బిఎస్పీ కార్మిక విభాగం జిల్లా కార్యదర్శి ఏడెల్లి అఖిల్ డోర్నకల్ అసెంబ్లీ అధ్యక్షులు భాషిపంగు మహేందర్,మరిపెడ మండల అధ్యక్ష, కార్యదర్శులు జినక కృష్ణమూర్తి, గుగులోత్ బాసునాయక్, నాయకులు కోర్ని సురేష్, జినక వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావును విస్మరించిన సీడబ్ల్యూసీ

అన్నావజ్జుల సూర్యప్రకాశ్

నవతెలంగాణ-నర్సింహులపేట

మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావును కాంగ్రెస్ విస్మరించిందని తెలంగాణ బ్రాహ్మణ ఉద్యోగ వృత్తి దారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అన్నావజ్జుల సూర్యప్రకాష్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సిడబ్ల్యుసి సమావేశాలు హైదరాబాద్‌లో అట్టహాసంగా నిర్వహిస్తున్న ఘనమైన ప్రకటనలు చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ నాయకులు పీవీని మర్చిపోవడం హాస్యాస్పదమన్నారు. రాజకీయ నాయకులు బ్రాహ్మణులను పట్టించుకోక పోవడం వలన త్వరలోనే వారికి సమాధానం ఇవ్వడానికి సమాయత్తం అవుతాన్నాయని అన్నారు.

బాపూజీ విగ్రహ కమిటీ అధ్యక్షునిగా సుధాకర్



నవతెలంగాణ-పాలకుర్తి

స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటు కమిటీ అధ్యక్షునిగా పాలకుర్తి గ్రామానికి చెందిన డాక్టర్ మేడారపు సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం పాలకుర్తిలో పద్మశాలీల సంఘం పట్టణ అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటుచేసిన పద్మశాలీల సంఘం సమావేశంలో గౌరవ అధ్యక్షులుగా పెనుగొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా చిదురాల ధనంజయ, బిర్రు సోమేశ్వర్, ఈగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా చిలుకమారి సోమేశ్వర్, కార్య నిర్వహణకార్యదర్శులుగా రాపోలు రాంబాబు, మాచర్ల సత్యనారాయణ, బైరు భార్గవ్, కోశాధికారిగా కామారపు సత్యం,కార్యవర్గ సభ్యులుగా పెనుగొండ సోమేశ్వర్, చిలుకమారి శ్రీధర్, కూరపాటి శ్రీకాంత్, చిలకమారి ఉప్పలయ్య,ఎలగందుల శ్రీనివాస్, రాపోలు గట్టయ్య, చిలుక మారి శివ, చిదురాల దేవేందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మేడారపు సుధాకర్ మాట్లాడుతూ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సహకారంతో పాలకుర్తి మండల కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పద్మశాలీలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు సహకారాన్ని అందిస్తున్న మంత్రి ఎర్రబెల్లికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని రమేష్, చిదురాల ఎల్లయ్య కాటబత్తిని సోమేశ్వర్, చిలుకమారి కుమార్ ,కూరపాటి సోమేశ్వర్, పెనుగొండ ఆనంద్, పెనుగొండ సోమశేఖర్, దేవగిరి శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

పశువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ వి. రఘుబాబు, డీఎల్డిఏ మేనేజర్ చింతకుంట్ల ఉపేందర్ సూచించారు. చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం,గాలికుంటు నివారణ టీకాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులకు పశుగ్రాసాల పెంపకం,దూడల పెంపకం లింగనిర్ధారణ వీర్యం గురించి వివరించారు. 74 పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేసి ఉచితముగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మల్కాపూర్‌లో పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారేపల్లి తిరుమల క్రిష్ణమోహన్ రెడ్డి, ఎంపీటీసీ మారేపల్లి లలిత శ్యామ్ కుమార్ రెడ్డి, మల్కాపూర్ పశువైద్యాధికారి డా. ముడికే అనేష్, డాక్టర్ దీపక్, వైద్య సిబ్బంది రమేష్, ఫయాజ్, బిక్షపతి, డీసీసీ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కిషన్ రెడ్డి, బైరగొని కోటి, అశోక్, బైరగొని హరీశ్, గోపాలమిత్ర సూపర్వైజర్ వై.రాజేశ్వరరావు, గోపాలమిత్ర ఎల్. జగ్గుమల్, యండి. అయాస్, ఎన్ సందీప్, గ్రామస్తులు, పాడి రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన కడియం

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మంగళవారం చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బత్తిని సూర్యనారాయణను పరామర్శించారు. వీరి వెంట సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, రాజవరం సర్పంచ్ మారేపల్లి తిరుమల క్రిష్ణమోహన్ రెడ్డి, ఎంపీటీసీ మారేపల్లి లలిత శ్యామ్ కుమార్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కాలువ కృష్ణారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు యాకుబ్, సమ్మయ్య, వెంకటేష్, కుమారస్వామి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేసిన కలెక్టర్



నవతెలంగాణ-జనగామ


ఫర్టిలైజర్ షాపులలో రైతులకు ఎరువులు పెస్టిసైడ్స్‌ల విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి ఫెర్టిలైజర్స్, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ సర్వీస్ ఫర్టిలైజర్స్ షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూవ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతీ ఎరువుల బస్తాలను పిఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) ఈ- పాస్ మిషన్ ద్వారా మాత్రమే ఎరువులను విక్రయించాలన్నారు. ఈ మిషన్ లో ఉన్న బ్యాలెన్స్ ఎరువుల వివరాల ప్రకారం షాపులో ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులను విక్రయించాలని లేనిపక్షంలో సంబంధిత డీలర్స్ షాపు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్, ఏడిఏ భినా తదితరులు ఉన్నారు.

ఏబిసిడి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాల్సిందే

నవతెలంగాణ-పాలకుర్తి

పార్లమెంటు సమావేశాల్లో ఏబిసిడి వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాల్సిందేనని ఎంజెఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎడవెల్లి సోము కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోజాతీయ స్థాయిలో వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పిస్తామని ఎన్నికల ప్రచారంలో మోసపూరిత హామీలు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల ఓట్లను దండుకున్న బిజెపి ప్రభుత్వం 9 ఏళ్ల గడిచిన వర్గీకరణ బిల్లు పట్ల స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి మాట నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం పార్లమెంట్లో వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుంటే దళితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంటు సమావేశాలు ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్, జిల్లా నాయకులు గాదె శ్రీధర్, మంద శ్రీనివాస్, నలిమేల నాగరాజు, చాడ ఏలీయా, హరిక్రిష్ణ, మండల ఇంచార్జీ గోవింద్ ఇస్సాక్, గుర్రం నవీన్, మేడ యాకస్వామి, రాంచందర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
బుధవారం | సెప్టెంబర్ 20, 2023 | www.navatelangana.com

రాజకీయ జోక్యం లేకుండా గొర్రెల పంపిణీ చేయాలి : జీఎంపీఎస్

నవతెలంగాణ-బయ్యారం

రెండో విడత గొర్రెలకు పంపిణీలో రాజకీయ జోక్యం లేకుండా డీడీలు కట్టిన వారందరికీ సకాలంలో గొర్రెలు పంపిణీ చేయాలని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దూదిమెట్ల మోహన్ రావు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ మండలంలో రెండో విడత గొర్రెల పంపిణీలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే గొర్రెలు పంపిణీ అయ్యేలా ఎమ్మెల్యేలు గ్రామ నాయకులు చూస్తున్నారని, మిగతా వాళ్ళు డిడి కట్టుకున్న కూడా గొర్రెలు రాకుండా ఆపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే గొర్రెల పంపిణీలో రాజకీయ జోక్యం లేకుండా గొర్రెలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పంచే గొర్లు కూడా నాణ్యమైనవి పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. రాజకీయ జోక్యంతో కొందరికి ఇచ్చి కొందరికి ఇవ్వకుంటే యాదవులందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు అధికారులను ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు బయ్య శీను, తొట్టి అశోక్, కత్తుల ప్రశాంత్, కలికినేని వీర సోములు, కేశ వెంకన్న, రాసమల్ల లింగయ్య, ఏనుగుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఏఆర్ ఎస్ఐ ఆత్మహత్య

నవతెలంగాణ-గంగారం



ఉరి వేసుకుని ఏఆర్ ఎస్ఐ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బరుగొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై దిలీప్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని భావురుగొండ గ్రామానికి చెందిన పడిగా శోభన్ బాబు (38) ఖమ్మం జిల్లా సత్తుపల్లి బెటాలియన్‌లో ఏఆర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. మృతుడి భార్య రజిత తన భర్త గత కొంతకాలంగా తీవ్ర మెడ నొప్పితో బాధపడుతున్నాడని, హాస్పిటల్‌కు వెళ్లాలని ఆదివారం మూడు రోజులు లీవ్ పెట్టి గ్రామానికి వచ్చామని తెలిపినట్లు చెప్పారు. మంగళవారం ఉదయం పొలం వెళ్లి వస్తానని వెళ్లి రాకపోయేసరికి చుట్టుపక్కల వారికి చెప్పడంతో పొలానికి వెళ్లి చూసే సరికి చెట్టుకు ఉరి వేసుకొని కనిపించారు. దీంతో గ్రామస్తుల సహకారంతో మృతుడిని ఇంటికి తీసుకు వచ్చారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

అమలుకు సాధ్యం కానీ కాంగ్రెస్ హామీలు

బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయం

మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య

నవతెలంగాణ-పెద్దవంగర

అమలుకు సాధ్యంకాని విధంగా కాంగ్రెస్ హామీలను ప్రకటించడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను దమ్ముంటే ముందుగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను మభ్య పెట్టేందుకే కాంగ్రెస్ నాయకులు ఆచరణకు సాధ్యం కానీ హామీలను ప్రకటించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో విపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ సంజయ్ కుమార్, సీనియర్ నాయకులు ముత్తినేని శ్రీనివాస్, శ్రీరామ్ సుధీర్, కనుకుంట్ల వెంకన్న, బానోత్ వెంకన్న, విజయ్ పాల్ రెడ్డి, బానోత్ సోమన్న నాయక్, రాసాల సమ్మయ్య, మోత్య తండా సర్పంచ్ ధరావత్ భీమా నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బోనగిరి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం మండల యూత్ కమిటీల ఎన్నిక

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు గంధసిరి శ్రావణ్ ఆధ్వర్యంలో యూత్ కమిటీల ఎన్నిక, సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగిల్ విండో వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి హాజరు కాగా కేసముద్రం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా గొల్లపల్లి మహేందర్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు చిట్లసంపత్, ఎన్ఎస్ యూఐ అసెంబ్లీ అధ్యక్షులు సముద్రాల మహేష్, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ గుగులోత్ నరేష్‌లకు మండలంలోని అన్ని గ్రామాల నాయకుల సమక్షంలో వారికి శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా అంబటి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో యువత పాత్ర క్రియాశీలకమైనది. అదేవిధంగా యూత్ కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయాలని రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను, కాంగ్రెస్ పార్టీనీ గెలిపించుకోవాలని, నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి,అయ్యూబ్ ఖాన్, సత్యానందం,యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు మిట్ట గడుపుల యాకూబ్, కంకాల బీరయ్య, కొట్టం చరణ్, జాటోత్ రమేష్, గుగులోతు రాము, పోలేపల్లి వెంకటరెడ్డి, నరేటి. కొమురయ్య, రాజుల పాటి మల్లయ్య, భూక్యమాలు, సట్ల శ్రీనివాస్, గాదె శ్రీనివాస్, కాటంరాంరెడ్డి,మేడి ఉపేందర్, పరాంకుశం. శ్రీహరి, ఎన్నెముల మహేందర్, లింగాల నేతాజీ, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, అజ్మీరా రమేష్, మెంతుల నవీన్, లొడియా వెంకన్న, పిట్టల మహేందర్, వాంకుడోత్ బాబూలాల్, చిట్ల రవి, మాసాడి శ్రీనివాస్,ఎస్.కె అమీర్, ఎండి పాషా, గోపాల శ్రీనివాస్ రెడ్డి, కనుకుల రాంబాబు, గుండు గోపాల్ పాల్గొన్నారు.

ఎరువుల కొనుగోలుకు ఆధార్ కార్డు తీసుకువెళ్లాలి

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

రైతులు ఎరువుల బస్తాలను కొనుగోలు చేయడానికి వెళ్లేటప్పుడు తమ వెంట ఆధార్ కార్డు తీసుకువెళ్లాలని మండల వ్యవసాయఅధికారి వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని తాళ్ళపూసపల్లిలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను ఏవో మంగళవారం తనిఖీలు చేపట్టారు. స్టాక్ రిజిస్టర్లను, స్టాక్‌ను పరిశీలించి మాట్లాడారు. పంటలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై ఎరువులను అందిస్తుందని, ఎరువుల బస్తాలను కొనుగోలు చేయడానికి వెళ్లేటప్పుడు ఆధార్ కార్డు తీసుకవెళ్లాలని సూచించారు. ఈ పాస్ మిషన్, రికార్డులలో, షాపులలో నిల్వలు ఒకే విధంగా ఉండాలని లేదంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వ నిభందంనల మేరకు రైతులు, డీలర్లు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాపు నిర్వాహకుడు అమ్మరాజు రాజశేఖర్ రైతులు పెద్ద ఉపేందర్, తోట నాగన్న, బొగ్గుల యాలాద్రి, పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ నిధుల నుండి సీసీ నిర్మాణం

జెడ్పీటీసీ భూక్య సంగీత

నవతెలంగాణ-నర్సింహులపేట

జిల్లా పరిషత్ నిధుల నుండి సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు నర్సింహులపేట జెడ్పిటిసి సభ్యురాలు భూక్య సంగీత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ నిధుల నుండి పది లక్షలు వెచ్చించి వేముల శ్రీనివాస్ రెడ్డి ఇంటి వద్ద నుండి మహమ్మద్ ఇస్సాకుద్దీన్ ఇంటి వరకు, పొన్నం శ్రీకాంత్ ఇంటి వద్ద నుండి ఎరనాగి బిక్షం ఇంటి వెనుక వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి పనులను ప్రారంభించారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అంగన్వాడీల నిరవధిక సమ్మె వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపి మాట్లాడారు. బొజ్జన్నపేట సీనియర్ జర్నలిస్టు కాశయ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ నిధుల నుండి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టిన సందర్భంగా కాలనీవాసులు సంగీతను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు జిల్లా ప్రధాన కార్య దర్శి చీకటి మహేష్ గౌడ్,తాడ పూర్ణచందర్ రెడ్డి,అల్లం సాయికుమార్, రాణి రెడ్డి, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, భూక్యసంతోష్, పిఎసిఎస్ డైరెక్టర్ పోలేపల్లి రజనీకాంత్ రెడ్డి, కూరపాటి శ్రీనివాస్, పెండెం సూరయ్య,మేకల యాకయ్య, పోలేపల్లి నారాయణ రెడ్డి, గౌని యాదగిరి, ఎండి మున్వర్,ఎర్ర వెంకటరాం నర్సయ్య ఉన్నారు.

కార్మిక హక్కుల కోసం పోరాడాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్య

నవతెలంగాణ-మరిపెడ

కార్మిక హక్కుల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షులు కొండ ఉప్పలయ్య అన్నారు. మండలంలోని భావోజీగూడెం గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం మిడతపల్లి సైదులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు గుర్తింపు కార్డు తీసుకోవాలని గుర్తు చేశారు. కార్మికుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెచ్చిస్తున్న కార్మిక నిధులను కార్మికులు వాడుకోవాలని సూచించారు. కార్మిక హక్కుల కోసం సిఐటియు పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు పసుపులేటి యాదగిరి, దూడపాక రాములు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

మరిపెడ మండలం భావోజీగూడెం భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మిడతపల్లి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా మిడతపల్లి కరుణాకర్, ఉపాధ్యక్షులుగా సూరారపు చంద్రు, కోశాధికారిగా మిడతపల్లి వెంకన్న, గౌరవ సలహాదారునిగా మిడతపల్లి సైదులు, తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులందరికీ వర్తింప చేయాలి

నవతెలంగాణ-బయ్యారం

సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ కార్యకర్తలకే కాదు అర్హులైన అందరికీ వర్తింప చేయాలని బీఎస్పీ ఇల్లందు నియోజకవర్గ ఇన్చార్జి బాదావత్ ప్రతాప్ బీఆర్ఎస్ ప్రభుత్వం పై మండి పడ్డారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలు బీఆర్ఎస్ వ్యక్తులకే ఇస్తున్నారు తప్ప నిజమైన అర్హులైన వారికి ఇవ్వడం లేదన్నారు. సంక్షేమ పథకాలు అందరికీ వర్తింప చేయాలి కానీ ఈ ప్రభుత్వము అధికార పార్టీ వ్యక్తులకు మాత్రమే, వాళ్లు అర్హులు కాకపోయినా వారికే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించి బహుజన రాజ్యాన్ని సాధిస్తామన్నారు. బహుజన రాజ్యంలో ఇలాంటి సమస్యలు ఉండవని అర్హులైన అందరికీ ప్రతి సంక్షేమ పథకం అమలయ్యే విధంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లేతకుల కాంతారావు, ఉమ్మడి మండల ఇంచార్జ్ అజ్మీర వెంకన్న, సంపత్, వినోద్, లోకేష్ పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె





















నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు, ఏఐటీయూసీ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్వాడీల సమ్మె మంగళవారం నాటికి 9 రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చ జరిపి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మె పైన ఐసిడిఎస్ అధికారులు తీవ్రమైన ఒత్తిడి వేధింపులకు సిబ్బందిపై పాల్పడుతున్నారని. సెంటర్ల తాళాలు పగలగొట్టి దొంగల్లాగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఐసిడిఎస్ సిబ్బంది వేధింపులకు పాల్పడి అంగన్వాడీల మానసిక సైర్యాన్ని దెబ్బ చేసినచో తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. సమ్మెలో ఉన్న సిబ్బందికి ఫోన్లు చేసి బెదిరించడం,సస్పెండ్లుచేస్తామని, టర్మినేట్ చేస్తామని హెచ్చరించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహా కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, ఏఐటీయూసీ నాయకులు నర్రా శ్రావణ్,వెలుగు శ్రావణ్, విష్ణు, జేఏసీ నాయకురాలు స్నేహ బిందు ఎల్లారీశ్వరి శివ కుమారి, సౌమ్య, మరియా, ఆండాలు, అనురాధ పాల్గొన్నారు.

నర్సింహులపేట : అంగన్వాడీ కార్మికులను పర్మినెంట్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని బీఎస్పీ మహబూబాబాద్ జిల్లా మహిళ కన్వీనర్ గుగులోత్ పార్వతి రమేష్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సింహులపేట మండల కేంద్రంలో అంగన్వాడీ కార్మికుల సమ్మె 9రోజుకు చేరిన సందర్భంగా బీఎస్పీ నాయకులు దీక్షకు తమ సంఘీభావం, పూర్తి మద్దతును తెలిపారు. ఈసందర్భంగా పార్వతి రమేష్ నాయక్ మంగళవారం ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి, డోర్నకల్ అసెంబ్లీ ఇంచార్జ్ ఐనాల పరశురాములు, లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య సమన్వయకర్త గుగులోత్ రమేష్ నాయక్, బీఎస్పీ జిల్లా ఇసి మెంబర్ ఎడ్ల శ్రీను, బీఎస్పీ డోర్నకల్ అసెంబ్లీ మహిళ కన్వీనర్ దర్శనాల మమత, మరిపెడ మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ బాసునాయక్, అంగన్వాడీల యూనియన్ మండల అధ్యక్షులు సమ్మెట లలిత, శ్రావణి, చంద్రకళ, సుహాసిని, విమల పాల్గొన్నారు.

అంగన్వాడి ఆధ్వర్యంలో వంటా... వార్పు...

మంగళవారం మండల కేంద్రంలో నిరవధిక సమ్మె 9 రోజును పురస్కరించుకొని అంగన్వాడి ఆధ్వర్యంలో వంట వార్పు, కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని, క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

చిన్నగూడూరు: అంగన్వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఎస్పీ జిల్లా ఇంచార్జ్ తేజ వర్సెస్ అభినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలో అంగన్వాడీ కార్మికులు సమ్మె తొమ్మిదవ రోజుకు చేరిన సందర్భంగా బీఎస్పీ నాయకులు దీక్షకు సంఘీభావం, మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా కార్యదర్శి డోర్నకల్ అసెంబ్లీ ఇంచార్జ్ ఐనాల పరశురాములు, బీఎస్పీ జిల్లా ఇసి మెంబర్ ఎడ్ల శ్రీను, బిఎస్పీ మరిపెడ, చిన్నగూడూరు మండలాల అధ్యక్షులు జినక కృష్ణమూర్తి, డెంకెల నవీన్ గౌడ్, అంగన్వాడీల యూనియన్ మండల అధ్యక్షులు సులోచన, జ్యోతి, ఏ వెంకటరత్నం, వరలక్ష్మి, ఎండి పర్వీన్, కవిత సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు : మండలంలోని వివిధ గ్రామాలలో పని చేస్తున్న అంగన్వాడీ టీచర్ల అయాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాటిని వెంటనే ఆపాలని సిఐటియు నెల్లికుదురు మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లికుదురు మండల కేంద్రంలో జరుగుతున్న అంగన్వాడీల నిరవేదిక సమ్మె 9వ రోజు చేరుకున్న సందర్భంగా ఆయన సందర్శించి పాల్గొని మాట్లాడుతూ కార్మికులు కర్షకులు విద్యార్థులు మేధావులు అనేక రకాల కార్మిక వర్గ సమస్యల సాధనకై పోరాటాల నిర్వహిస్తేనే తమ హక్కులు సాధించుకుంటారని మనమందరం ఐక్యతలో ఉండి మన హక్కులను మనం కాపాడుకునేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఏఐటీయూసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు లక్ష్మీ నర్సమ్మ వీరలక్ష్మి, సరస్వతి, వెంకటమ్మ, జమాల్బి, మహతి, ఎల్లమ్మ, జ్యోతి, పద్మ, దాసరి కవిత తదితరులు పాల్గొన్నారు.

గూడూరు : మండల కేంద్రంలో చేపడుతున్న అంగన్వాడీల సమ్మె శిబిరానికి బీఎస్పీ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. అంగన్వాడీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఎస్పీ జిల్లా ఇంచార్జి దార ప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో ప్రాజెక్టు అధ్యక్షులు పగిడిపాల తిరుపతమ్మ, మంజుల, రజిని, ఉమా, పద్మ, పారిజాతం తదితరులు పాల్గొన్నారు.

గార్ల : అంగన్వాడీ సమస్యలను పరిష్కరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్, బిఎస్‌పి మండల అధ్యక్షులు అజ్మీర వెంకన్నలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కళ్లకు గంతలు కట్టుకొని అంగన్వాడీలు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. సంఘిభావం తెలిపిన వారిలో టిజెఎస్ రాష్ట్ర నాయకులు జి.మురళి తారక్, పిడిఎస్‌యు మండల కార్యదర్శి యం.మహేష్ కుమార్, బిఎస్‌పి కార్యకర్తలు ఉన్నారు. సమ్మెలో యూనియన్ జిల్లా, మండల నాయకులు నీలా దేవి, టి.పద్మ, సుజాత, వసంత, ఉపేంద్ర, క్రిష్ణ కుమారి, శ్రీలక్ష్మి, సుజాత, విక్టోరియా, ఎమ్మాల్య తదితరులు ఉన్నారు.

పెద్దవంగర : అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉద్యోగులు బిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రధాన కార్యదర్శి పసుల స్వరూప మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులకు సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు మంజుల, రేణుక, అంబిక, మమత, యాదమ్మ, యాకలక్ష్మీ, ఎల్లమ్మ, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడ : అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పిడిఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న అంగన్వాడి టీచర్ల సమ్మెకు న్యూడెమోక్రసీ నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుండి తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఆయన వెంట న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బూర్క వెంకటయ్య, నాయకులు నర్సక్క, మంగన్న, వనిత, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు తీర్చండి మహానాయక...

మా సమస్యలను తీర్చిమాకుఅండగా నిలవాలి మహానాయక అని అంగన్వాడి టీచర్స్ సంఘం ప్రతినిధులు సమ్మక్క వినాయకున్ని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో వినాయకునికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సమ్మక్క మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వాన్ని స్పందించి అంగన్వాడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న బుజ్జగింపులు..!

గెలిపే లక్ష్యంగా ఎమ్మెల్యే రెడ్యానాయక్ వ్యూహం

నవతెలంగాణ-మరిపెడ



గత కొంతకాలంగా అస్మతి రాగంతో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న పలువురి నేతలను బుజ్జగించే ప్రయత్నంలో ఎమ్మెల్యే రెడ్యా నాయక్ పావులు కదుపుతున్నారు. ఈ మేరకు మంత్రి సత్యవతి రాథోడ్ మంత్రి హోదాలో డోర్నకల్ నియోజకవర్గంలో అధికారిక కార్యక్రమంలో పాల్గొనకుండా స్థానిక ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారని ఇటీవల కాలంలో ఆమె అనుచరులు వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేయడంతో ఒక్కసారిగా డోర్నకల్ రాజకీయాలు చర్చనీయాంశంగా మారాయి. సీఎం కేసీఆర్ సీట్టింగ్ ఎమ్మెల్యేకే టికెట్ కేటాయించడంతో స్థానిక ఎమ్మెల్యే రెడ్యానాయక్ అసమ్మతినేతల్ని దగ్గరికి చేసుకోవాలని ప్రయత్నంలో సీనియర్ల చుట్టూ తిరగడం రాజకీయ వర్గాలలో కలవరం పెడుతుంది. మా మధ్య ఎలాంటి విభేదాలు లేవంటూ మభ్య పెట్టే ప్రయత్నంలో ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నట్లు చర్చ జరుగుతుంది. ముందుగా ఆయనకు టికెట్ ఇచ్చినందుకు కృతజ్ఞత భావంతో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్ రావులను మర్యాదపూర్వకంగా కలిసి వారికి అభినందనలు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు.అనంతరం మంత్రి సత్యవతి రాథోడ్‌ను ప్రగతి భవనంలో ఎమ్మెల్యే రెడ్యా నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తమకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరినట్లు సమాచారం. అంతేగాక బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త తానంచర్ల వాస్తవ్యులు రామసహాయం రంగారెడ్డి గత కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నా వారిని కూడా హైదరాబాదులో వారిని ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మరిపెడ మాజీ సర్పంచ్ కొంపల్లి రాంరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండంతో చాలా సంవత్సరాలు తర్వాత రామ్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అదే క్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్ ప్రధాన అనుచరులు కాంట్రాక్టర్స్ కొంపల్లి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఉకల్ ఎంపిటిసి సత్యనారాయణ రెడ్డిలను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలుసుకోవడం ఉకల్ గ్రామస్తులు విస్మయానికి గురైనట్లు చర్చ జరుగుతుంది. ఎన్నికలు రాగానే ఈ గ్రామంలో రెండు వర్గాలుగా చీల్చి సామాన్య ప్రజలను పావులుగా వాడుకునే విధానం ఉంది. ఎన్నికల అవసరాల కోసం నాయకులకు నేతలు ఇండ్లలోకి రావడంతో ఉకల్ గ్రామ ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. నరసింహులపేట మండలం బొజ్జన్నపేట గ్రామ వాస్తవ్యులు సోమేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, మంత్రి అనుచరుడు దాట్ల రవి, దంతాలపల్లిలోని మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి వారి అనుచరులను, కురవి జెడ్పిటిసి బండి వెంకటరెడ్డి, నారాయణపురం గ్రామంలో అల్లూరి పట్టాభి రామరాజు, డోర్నకల్ మండలం ఉయ్యాలవాడలో నున్న హనుమ, సిరోల్ గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ వెంకట్ రెడ్డి, అయ్యగారి పల్లెలో ప్రముఖ అడ్వకేట్ మేకల సురేష్ రెడ్డి, పురుషోత్తమయగూడెం గ్రామ వాస్తవ్యులు బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్ రెడ్డి, ఆ గ్రామ సర్పంచ్ నూకల అభినవరెడ్డిలను ఎమ్మెల్యే రెడ్యానాయక్ తన అనుచరులతోమర్యాదగాపూర్వకంగా కలిసి వారిని ఘనంగా సన్మానించి మాటామంతి చేసుకున్నట్లు తీరు తీవ్రమైన చర్చ జరుగుతుంది. కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉంటున్న నేతలను మచ్చిక చేసుకునే పనిలో రెడ్యానాయక్ ఉన్నట్లు తెలుస్తుంది. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా బుజ్జగింపులను కొనసాగిస్తున్నట్లు నియోజకవర్గంలోని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మనుషులను కలిసిన చివరికి మనస్సు కలిసేనా అని...? పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా రాజకీయాలలో ప్రత్యర్థులకు చిక్కకుండా ఎత్తుకుపై ఎత్తులు వేస్తూ కొనసాగిస్తున్న బుజ్జగింపులు ప్రయత్నాలు ఫలించేనని పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

పెద్ద పీట వేస్తున్న ఝాన్సీ రెడ్డి

పాలకుర్తిలో తమ సామాజిక వర్గానికే

అందరినీ కలుపుకుపోతేనే గెలుపు సాధ్యం

ఓబిసి మండల అధ్యక్షులు దీకొండ శ్రీనివాస్, మాజీ మండలాధ్యక్షులు మెరుగు మల్లేశం

నవతెలంగాణ-తొర్రూరు

పాలకుర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఆశిస్తున్న ఎన్ఆర్ఐ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి తన సామాజిక వర్గానికి చెందిన వారికి పెద్ద పీట వేస్తూ ఇతరులను విస్మరిస్తుందని ఓబిసి మండల అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు మెరుగు మల్లేశంలు ఆరోపించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటూ వస్తూ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకులను విస్మరిస్తూ, మోసం చేస్తున్న తీరును మార్చుకోని పాలకుర్తి నియోజకవర్గంలో అధిక శాతం ఉన్న బీసీలకు అన్యాయం చేయకుండా తొర్రూరు మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన చెవిటి సధాకర్‌నే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా జంగా రాఘవరెడ్డి పోటీ చేసి ఓడిపోయిన నాటి నుండి కార్యకర్తలను, పార్టీని కాపాడుకుంటూ వారి సమస్యలు పరిష్కరించే సందర్భంలో జైలుకు వెళ్లిన సంఘటనలు కూడా ఉన్నాయని అలాంటి వరిని విస్మరిసుందని ఆరోపించారు. ఇన్ని సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీని కాపాడుకుంటూ వస్తున్న వారిని పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేస్తున్న వారిని అందలమెక్కిస్తుందని వారు ఆరోపించారు. నియోజకవర్గంలో ఝాన్సీ రెడ్డి ఒంటెద్దు పోకడలను మార్చుకొని అందరిని కలుపుకొని పోవాలని లేకపోతే పార్టీ హై కమాండ్‌కు ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తొర్రూరు పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అల్వాల సోమయ్య, ఓబీసీ జిల్లా కార్యదర్శి నల్ల మాస సమ్మయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోటగిరి సుదర్శన్, మాచర్ల శ్రీనివాస్, వెలికట్ట గ్రామ పార్టీ అధ్యక్షుడు, వార్డు మెంబర్ ప్రతి కంఠం దేవేందర్ రాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బచ్చలి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు రాంపల్లి రవి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బోలగాని శ్రీనివాస్, రాహుల్ యువసేన నియోజకవర్గం అధ్యక్షులు రాయిపల్లి రాజు, యూత్ ఉపాధ్యక్షులు వస్తం కృష్ణ, వెంకటాపురం గ్రామఉపాధ్యక్షులు నల్ల మాస వీరబాబు, కంటాయపాలెం గ్రామ ఉపాధ్యక్షులు మందపురి చంద్రమౌళి, జిల్లా నాయకులు గట్టు కొమురయ్య, నాయకులు ఎర్రబోయిన వెంకన్న, రాములు, నందానాయక్,అబ్బాస్,శ్రీకాంత్, రంగయ్య పాల్గొన్నారు.

కిరాణం డబ్బా దగ్ధం

లక్ష రూపాయల ఆస్తి నష్టం

నవతెలంగాణ-మరిపెడ

మండలంలోని అబ్బాయి పాలెం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులచే సోమవారం పట్టపగలు కిరాణం డబ్బా అగ్నికి దగ్ధమైపోయింది. బాధితులు మూడుసు లక్ష్మి రాములు తెలిపిన వివరాల ప్రకారం తన కూతురు పంచాయతీ విషయంలో గత కొన్ని రోజులుగా కిరాణం డబ్బా తీయకుండా ఊరికి వెళ్లినట్లు తెలిపారు. సోమవారం కిరణం షాప్ తీద్దామని అనుకోగా మేము ఇంట్లో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు వెనక నుండి గుడిసెకు నిప్పు పెట్టడంతో డబ్బా బూడిదైనట్లు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ముడుసు లక్ష్మి వెంకన్న తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు.



కాంగ్రెస్‌తోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి

మాజీ కేంద్రమంత్రి బలరాం నాయక్

నవతెలంగాణ-నెల్లికుదురు

కాంగ్రెస్‌తోనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి చెందిందని రాబోయే రోజుల్లో కూడా తెలంగాణ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని మాజీ కేంద్రమంత్రి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఏఐసీసీ వ్యవహారాల అమలు కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనలో సోనియా గాంధీ విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ 6 పథకాలతో గ్యారెంటీ కార్డు సంబంధించిన పోస్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని ఇక కేసీఆర్ ఆటలు సాగవని, తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ జెడ్పిటిసి హెచ్.వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, మండలాధికార ప్రతినిధి మౌనేందర్, వరిపెల్లి పూర్ణచందర్, సలుగు పూర్ణ చందర్, హెచ్ మల్లేష్, మౌలానా,వీరన్న, బైరు అశోకగౌడ్, శ్రీనివాసరెడ్డి, రత్నాపురం యాకయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం - మందుల పంపిణీ

నవతెలంగాణ-నరసింహులపేట

ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని స్థానిక ఎంపీడీవో భారతి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం స్థానిక ఎంహెల్‌హెచ్‌పి డాక్టర్ చందు ఆధ్వర్యంలో 58 మందికి పరీక్షలు చేయగా అందులో ఆరుగురికి జ్వరం, దగ్గు, జలుబు ఉన్నవారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ సోములాల్, సిహెచ్ఓ బాలాజీ, ఎంఎల్‌హెచ్‌పి అన్వేష్, ఏఎన్ఎంలు ప్రసన్నకుమారి, కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, చలపతి, ఆశాలు వెంకటలక్ష్మి, జ్యోతితో పాటు అధికారులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో రాష్ట్ర స్థాయికి జెడ్‌పిహెచ్ఎస్ కలవల

నవతెలంగాణ-కేసముద్రం రూరల్

మహబూబాబాద్ జిల్లా స్థాయిలో ఎస్‌జీఎఫ్ఐ నిర్వహించిన రెజ్లింగ్ పోటీలలో జెడ్పిహెచ్ఎస్ కలువల పాఠశాల నుండి వివిధ విభాగాలలో పది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను గ్రామ సర్పంచ్ గంటా సంజీవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు చీకటి వెంకట రామ నరసయ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు బి.జ్యోతి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు గొట్టం రోజారాణి, కె.సమ్మిరెడ్డి, డీకే వెంకటేశ్వర్లు, ఏ శ్రీనివాస్, ఆర్.బిక్షపతి, ఎం.ఏకాంబరం, వి.రాజేంద్ర చారి, బి.బాలషోరెడ్డి, ఏ.వెంకటేశ్వర్లు, వి.రాము, ఆర్.లక్ష్మీనారాయణలు అభినందించారు.

వాగులో దూకి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బయ్యారం

మండల శివారులోని ఇల్లందుకు వెళ్లే ప్రధాన రహదారి పై ఉన్న అలిగేరు బ్రిడ్జి పై నుండి బొలగాని రమేష్(28) దూకి బలవన్మరణం చెందినట్లు ఎస్ఐ ఉపేందర్ తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా బయ్యారం నుంచి గంధంపల్లి వెళుతుండగా బ్రిడ్జి పై ద్విచక్ర వాహనం, పక్కనే చెప్పులు, మొబైల్ ఫోన్ ఉండడాన్ని గమనించినట్లు తెలిపారు. తిరిగి వస్తుండగా అదే ప్రాంతంలో ద్విచక్ర వాహనం ఉండటాన్ని గమనించి విచారణ చేయగా మండల కేంద్రంలో బొలగాని రమేష్ వాహనం అని గుర్తించారని తెలిపారు. సోమవారం గజ ఈతగాళ్లతో వాగిలో వెతకగా మృతదేహం గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా జెడ్పీ సీఈవో విజయలక్ష్మి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-చిట్యాల



చిట్యాల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా ముఖ్య కార్య నిర్వహణ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దావు వినోద, జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీడీవో రామయ్య కలిసి జెడ్పీ సీఈఓ చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూకల్ సర్పంచ్ పుట్టపాక మహేందర్, ఎంపీఓ రామకృష్ణ, పీఆర్ ఏఈ రవికుమార్, ఏపీఓ అలీంపాష, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు సిద్ధాంతాలకు ప్రజాస్వామ్యంలో తావు లేదు

నవతెలంగాణ -మహాముత్తారం



మావోయిస్టు సిద్ధాంతాలకు వారి విధి విధానాలకు ప్రజాస్వామ్య దేశంలో తావు లేదని కాటారం డీఎస్పీ జి రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మహాముత్తారం మండలం లోని సింగారం గ్రామపంచాయతీ పరిధి దండేపల్లిలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మావోయిస్టులకు ఎవరు సహకరించవద్దని, ఎవరైనా సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కాటారం సీఐ రంజిత్ రావు మాట్లాడుతూ.. పిల్లలను చది వించాలని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహ ముత్తారం స్థానిక ఎస్సై దాసరి సుధాకర్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన రుణాల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నవతెలంగాణ-భూపాలపల్లి



జిల్లాలో లక్ష రూపాయల రుణమాఫీ జరిగిన రైతులందరికీ ప్రణాళికా బద్ధంగా నూతన రుణాల పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. మంగళవారం ప్రగతి భవన్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బ్యాంకర్లతో డీసీసీ, డీఎల్ఆర్‌సి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటివరకు 37వేల910 మంది రైతులకు రూ.211కోట్ల92 లక్షల రుణమాఫీ సొమ్ము వారి రుణ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. జిల్లాలోని 3వేల795మంది రైతుల రుణ ఖాతాలు క్లోజ్ అయినందున రుణమాఫీ సొమ్ము ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ జమ చేయలేకపోయామని అన్నారు. ఆధార్ నెంబర్ ఆధారంగా 3వేల617 మంది రైతుల రైతు బంధు ఖాతా వివరాలు సేకరించి, అందులో రుణమాఫీ సొమ్ము జమ చేస్తామని తెలిపారు. జిల్లాలో దాదాపు 178 మంది రైతుల బ్యాంకు ఖాతా వివరాలు లభించడం లేదని, వ్యవసాయ విస్తరణ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి సదరు రైతుల బ్యాంకు ఖాతా వివరాలు సేకరించి త్వరితగతిన లీడ్ బ్యాంక్ మేనేజర్ ద్వారా బ్యాంకర్లకు అందించాలని ఆదేశించారు. సెప్టెంబర్ చివరి నాటికి రుణమాఫీ జరిగిన రైతులందరికీ నూతన రుణాలు పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 11 నాటికి 1242 స్వశక్తి సంఘాలకు రూ.87 కోట్లు, మెప్మా కింద 125 స్వశక్తి సంఘాలకు దాదాపు రూ.7 కోట్ల99లక్షల రుణాలు అందించామని అధికారులు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాల్లో 41 శాతం పూర్తయిందని, పెండింగ్ రుణాల ప్రతిపాదనలు సైతం బ్యాంకర్లకు అందించి త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతంలో బ్యాంకర్లకు అందాల్సిన గ్రూపు వివరాలు వెంటనే అందజేసేలా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణాలలో సైతం మెప్మా బందాల వివరాలు బ్యాంకులకు అందించి రుణాలు మంజూరి జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 604 స్వశక్తి సంఘాలు రూ. 3.53 కోట్ల ఎన్‌పీఏ ఉందని అధికారులు వివరించారు. జిల్లాలో రుణాల రికవరీ పై శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. యువతకు ఉపాధి అందించే విషయంలో అధికారులు చొరవ చూపాలని బ్యాంకర్లకు సూచించారు. ఎస్సీ కార్పొరేషన్ , కార్పొరేషన్‌కు సంబంధించి యూనిట్లు గ్రౌండ్ చేయకుంటే ప్రభుత్వం విడుదల చేసిన సంబంధిత సబ్సిడీ సొమ్ము తిరిగి ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 2023-24 వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, వివిధ బ్యాంకు మేనేజర్లు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పట్టాల పంపిణీ చేపట్టాలి

పెండింగ్ పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మంగళవారం రేగొండ మండల తహసీల్దార్ కార్యాలయంలో రేగొండ తహసీల్దార్, కొత్తగా నెలకొన్న గోరికొత్తపల్లి తహసీల్దార్‌లతో సమీక్షించారు. రేగొండ మండలంలోని రామన్నగూడెంలోని సర్వే నెంబర్ 662, 663, కొత్తపల్లిగోరి గ్రామంలోని 391 సర్వే నంబర్‌లను పరిశీలించి సాగులో ఉన్న రైతులకు పట్టాలు అందజే యాలని అన్నారు. ఎంజాయ్ మెంట్ సర్వే పూర్తి చేసుకున్న రామన్న గూడెం 662,663 కొత్తపల్లి గోరి గ్రామంలోని 391 సర్వే నబర్లకు సాగులో అర్హులైన వారికి తక్షణమే పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ధరణి పోర్టల్‌లో పెట్టుకున్న అర్జీలను పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. తహసీల్దార్లు సత్యనారాయణ స్వామి, రవికుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



రామప్ప కాలనీలో 'సంతోష్ వనం'

ఓసి త్రీ ప్రాజెక్టును పరిశీలించిన ఐఆర్ఎస్ డైరెక్టర్(ఫైనాన్స్) బలరాం

నవతెలంగాణ-గణపురం

మండలంలోని బసవరాజుపల్లి శివారు 1500 క్వార్టర్స్‌లో మంగళవారం ఐఆర్ఎస్ డైరెక్టర్(ఫైనాన్స్) బలరాం ఆధ్వర్యంలో రామప్ప కాలనీలో మొక్కలు నాటారు. మొక్కలు నాటిన అనంతరం రామప్ప కాలనీలో సంతోష్ వనం అనే నామాకరణాన్ని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఇప్పటివరకు 16700 మొక్కలను నాటినట్టు చెప్పారు. సింగరేణి మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ శ్రీధర్ ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యం, జీవావరణ వ్యవస్థను సింగరేణి పరిసర ప్రాంతాల్లో నెలకొల్పేందుకు మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. హరిత హారంలో భాగంగాసింగరేణిని సంస్థని హరిత సింగరేణిగా మారుస్తున్నామని అన్నారు. గత 8 విడతల్లో సింగరేణిలో సుమారు 5600హెక్టార్లలో 5కోట్లకు పైగా మొక్కలను నాటిటినట్టు తెలిపారు. సింగరేణి చుట్టుపక్కల కూడా హరితవనాలు పెంపొందించామన్నారు. భూపాలపల్లిఏరియాలో ఒక ప్రత్యేక నర్సరీని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం డైరెక్టర్, ఏరియా జనరల్ మేనేజర్ బళ్ళారి శ్రీనివాసరావుతో కలిసి స్థానిక కెటీకే ఓసీ-3 ఉపరితల గనిని సందర్శించారు. ఉత్పత్తి, రవాణా, ఓబి రిమూవల్ ప్రక్రియను రక్షణతో లక్ష్యాన్ని సాధించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అధికవర్షాల వల్ల అన్ని ఓసీ క్వారీలలో చేరిన నీరును డివాటరింగ్ చేసి బొగ్గు వెలికితీతకు పాటు పాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి అజ్మీర తుకారాం, ఏజీఎం ఎస్ జ్యోతి, ఎన్ వి రావు, రవికుమార్, ఎన్ రామకృష్ణ రెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు త్వరితగతిన ప్రారంభించాలి

ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ -తాడ్వాయి

పస్రా నుండి లింగాల వరకు ఆర్అండ్‌బీ రోడ్డు పనులు త్వరితగతిన ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మంగళవారం తాడ్వాయి మండలంలోని పస్రా నుండి లింగాల వరకు ఆర్ అండ్‌బి రోడ్డును, గుండ్ల వాగు బ్రిడ్జిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పస్రా నుండి లింగాల వరకు 27 కిలోమటర్ల ఆర్అండ్‌బి రోడ్డు గతంలో మంజూరైందని, 5 కిలోమీటర్లు పూర్తి అయిందన్నారు. మిగిలి ఉన్న 22 కిలోమీటర్ల రోడ్డు ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చినందున త్వరితగతిన పనులు ప్రారంభించాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. బంధాల, బొల్లెపల్లి రోడ్డు మార్గం వివరాలను కలెక్టర్ ఆర్అండ్‌బి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓటర్ నమోదు ప్రత్యేక క్యాంపెయిన్ లో భాగంగా బిట్టుపల్లి(కొడిశల), లింగాలలోని పోలింగ్ స్టేషన్ నెం.185, 248 లను జిల్లా కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ బిఎల్ఓ లు వారి పోలింగ్ కేంద్రం పరిధిలో అక్టోబర్ 1, 2023 నాటికి 18ఏండ్లు పూర్తి అయిన వారి వద్దకే వెళ్లి ఫామ్-6 ద్వారా ఓటరుగా నమోదు చేయాలన్నారు. చనిపోయిన ఓటర్లు ఉంటే వారి మరణ ధృవీకరణ పత్రం లేదా వారు మరణిస్తే ఫామ్-7లో నమోదు చేసి ధృవీకరించి పంపించాలని తెలిపారు. ఫోటో కరెక్షన్, డబల్ ఎంట్రి ఇతర పొరపాట్లు లేకుండా సరిచేయాలని తెలిపారు. జాబితాలో మార్పులు, చేర్పులకు మరో అవకాశం లేనందున ఈ క్యాంపెయిన్‌ల ద్వారా పోలింగ్ బూత్ పరిధి అర్హులైన ప్రతి ఓటరు వివరాలు పక్కాగా ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్అండ్‌బీ డీఈ రఘువీర్, స్థానిక తహసీల్దార్ తోట రవీందర్, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, ఎమ్మార్వైలు దేగల సాంబయ్య, సునిల్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన పెంపొందించుకోవాలి

జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి

నవతెలంగాణ-చిట్యాల

విద్యార్థులు విద్యతోపాటు మంచి విషయాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని జెడ్పీ సీఈవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కేజీవీబీ పాఠశాల, కళాశాలను ఆమె సందర్శించి స్వచ్ఛత సేవా కార్యక్రమాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛత సేవ కార్యక్రమాలపై వ్యాసరచన డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛత కార్యక్రమం పట్ల ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తు ను తామే నిర్ణయించుకునే విధంగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, ఎంపీఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవి, స్థానిక సర్పంచ్ పూర్ణచంద్రావు, ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

ఓటరు నమోదుపై అధికారులకు జెడ్పీ సీఈవో విజయలక్ష్మి అవగాహన కల్పించారు. మండలంలోని తాసిల్దార్ కార్యాలయంను ఆమె మంగళవారం సందర్శించి ఓటరు నమోదు కార్యక్రమ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సుమన్, ఎంపీడీవో రామయ్య, డిప్యూటీ తాసిల్దార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గద్దె దించి...తొమ్మిదేండ్ల కష్టాలు తొలగిస్తాం

అస్సాం సీఎల్పీ నేత, సీడబ్ల్యుసి మెంబర్ దేబబ్రత సైకియా

నవతెలంగాణ-గణపురం



రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి రాష్ట్ర అభివృద్ధికి అవకాశం ఇస్తే, బీఆర్ఎస్‌ను గద్దె దించి తొమ్మిదేండ్ల ప్రజల కష్టాలు తీరుస్తామని అస్సాం సీఎల్పీ నేత, సీడబ్ల్యుసీ మెంబర్ దేబబ్రత సైకియా అన్నారు. తుక్కుగూడ విజయభేరీ సభలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీ కార్డుల ఇంటింటికి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాలంపేటలోని రామప్ప దేవాల యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నియో జకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు ఆధ్వ ర్యంలో ఊరేగింపుగా బైక్ ర్యాలీతో గణపురం మం డల కేంద్రానికి చేరుకోగా ఘన స్వాగతం పలికారు. చౌరస్తాలో రోడ్ షో నిర్వహించి, రాజీవ్‌గాంధీ విగ్రహాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆరు గ్యారెంటీ కార్డుల అంశాలను గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. మహాలక్ష్మీ పథకం ద్వారా పేద మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణం, తదితర వాటికి సంబంధించిన గ్యారెంటీ కార్డులను గ్రామ ప్రజలకు అందజేశారు. రానున్న ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ తొమ్మిదేండ్లలో నియంతృత్వ పాలనతో ప్రజలను కష్టాలకు గురిచేశారని అన్నారు. ఇకపై కేసీఆర్ ఆటలు సాగని వ్వబోమని అన్నారు. గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి ఆమెకు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చే హామీలతో కుడిన 'అభయ హస్తం' గ్యారెంటీ కార్డు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 7286855555 నెంబరుకు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ దూడపాక శంకర్, జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్, మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, జిల్లా నాయకులు బోనాల రాజమౌళి, ఇమ్మడి వెంకటేశ్వర్లు, మామిండ్ల మల్లికార్జున్, సుంకరి సుధాకర్ రెడ్డి, కట్కూరి శ్రీనివాస్, దూడపాక దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీని రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని అస్సాం సీఎల్పీ నేత దేవా బ్రత సైకియా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు, జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, దేశంలో బీజేపీ అవినీతి పాలన కొనసాగిస్తున్నాయన్నారు. ఆ పాలనకు చరమగీతం పాడాలన్నారు. కాంగ్రెస్ 6 గ్యారంటీ సూత్రాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం ముగ్గురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులను సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దూడపాక శంకర్ గణపురం మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్ వైస్ ఎంపీపీ విదిధినేని అశోక్, తదితర మండలాల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తీర్చేది కాంగ్రెస్ మాత్రమే : మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మల్హర్‌రావు : ప్రజల కష్టాలు తీర్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీదర్ బాబు అన్నారు. తెలంగాణలోని ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు సమగ్ర ప్రణాళిక చేసిన కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలను మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి వివరించారు. స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో సంబంధిత కరపత్రాలను అందజేశారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు తర్వాత 6 కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను సామాన్య నిరుపేద ప్రజలకు తప్పకుండా అందజేస్తామని వివరించారు.



రామస్వామి మరణం పార్టీకి తీరని లోటు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు

నవతెలంగాణ-భూపాలపల్లి



రామస్వామి మరణం సీపీఐ(ఎం)కు తీరని లోటు అని పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు, సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు అన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు వందల రామస్వామి అకాల మరణం చెందగా మంగళవారం ఆయన మృతదేహానికి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి ప్రకటించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడారు. ఇల్లందులో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నుంచి ఉద్యోగం వచ్చేవరకు విద్యార్థి రంగంలో పనిచేసినట్టు చెప్పారు. ఉద్యోగరీత్యా భూపాలపల్లికి వచ్చిన వంగల రామస్వామి సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ)లో పనిచేస్తూ కార్మికుల కోసం నిరంతరం కృషి చేశాడని గుర్తు చేశారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడిస్థాయికి ఎదిగి నిత్యం ప్రజలతో మమేకమై తుదిశ్వాస వరకు ప్రజాతంత్ర ఉద్యమంలోనే కొనసాగాడన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా రామస్వామి, ఆయన భార్య లక్ష్మి మహిళా సంఘం జిల్లా అధ్యక్షులుగా ఉన్నారు. సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్‌లో బ్రాంచ్ కార్యదర్శి నుంచి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు వరకు సొంత కృషితో రామస్వామి ఎదిగారని కొనియాడారు. ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య , జిల్లా కమిటీ సభ్యులు వెలిశెట్టి రాజయ్య, గుర్రం దేవేందర్ శ్రీకాంత్ , పార్టీ సభ్యులు బంధు క్రాంతి సుజాత రవికుమార్ రాజేందరు శ్రావణ్ శ్రీధర్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలి

అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అధ్యక్షులు కె సమ్మక్క

నవతెలంగాణ- తాడ్వాయి



అంగన్వాడి టీచర్లను పర్మినెంట్ చేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి కురెందుల సమ్మక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 11 నుండి ప్రారంభమైన అంగన్వాడీల నిరవధిక సమ్మె మంగళవారం 9వ రోజుకు చేరింది. మంగళవారం నాడు మండలంలోని అంగన్వాడి టీచర్లు వినూత్నంగా నిరసన కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కురెందుల సమ్మక్క మాట్లాడుతూ అంగన్వాడీలను వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26,000 అందించాలని డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పెన్షన్, ఈఎస్ఐ ఉద్యోగ భద్ర సౌకర్యాలు కల్పించాలన్నారు. సుప్రీం కోర్టు ప్రకారం రాష్ట్రంలోనూ అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాడ్యుటీ చెల్లించాలని, రిటర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు 10 లక్షలు, హెల్పర్లకు 5 లక్షలు చెల్లించాలని, నిబట్టి వేతనంలో వ్యత్యాసం ఉండాలని ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షులు జమున, నాయకులు సరిత, నిర్మల, వెంకటలక్ష్మి, 85 మంది అంగన్వాడి టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

67వ ఎస్జీఎఫ్ క్రీడలు

నవతెలంగాణ-గోవిందరావుపేట



మండలంలోని కర్కపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్జీఎఫ్ క్రీడలు స్థానిక ప్రధానోపాధ్యాయులు కల్తీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల క్రీడల ఇన్‌చార్జి, ఎంఈఓ గొంది దివాకర్‌తో కలిసి స్థానిక ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని గెలుపు, ఓటములు సహజమని, నేటి ఓటమి రేపటి విజయానికి నాంది కావాలని తెలిపారు. ఈ నెల ఏటూరునాగారంలో నిర్వహించే జిల్లాస్థాయి క్రీడలలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎన్నికై మండల, జిల్లా పేరు నిలబెట్టాలని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ కేజీబీవీ జిల్లా పరిషత్, ఆశ్రమ, ప్రయివేట్‌కు చెందిన విద్యార్థులు అండర్-14,17 సంవత్సరాల బాల, బాలికలు సుమారు 350మంది హాజరైనట్టు తెలిపారు. వీరికి ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్ బానోత్ బాలు భోజన వసతి కల్పించారు. వ్యాయామ ఉపాధ్యాయులు యాలం ఆదినారాయణ మెడిశెట్టి, సుధాకర్, జి. కనకయ్య, మేకల కృష్ణ, రాయబారపు దీప్తి, నాగమణి, నరేష్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా బాధ్యులు చింత కృష్ణ, లక్ష్మీపురం సర్పంచ్ లావుడ్య స్వాతివాదానాయక్ పాల్గొన్నారు.

పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ- మంగపేట

మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలను పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం జయరాంరెడ్డి మాట్లాడుతూ అశోక్ మార్గదర్శకత్వంలో ములుగు నియోజకవర్గంలో కాంగ్రెస్ మరో మారు విజయకేతనం ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హ్యూమన్ రైట్స్, ఆర్‌టిఐ చైర్మన్ బండ జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యనయ్య, జిల్లా సెక్రటరీలు తుడి భగవాన్, మసిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రి నాగేంద్రబాబు, బీసీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ కాటబోయిన నరసింహారావు, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మురుకుట్ల నరేందర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు టీపీ హిదయ తుల్లా పాల్గొన్నారు.

భారత మహిళా సమాఖ్య పోరాట ఫలితమే మహిళా రిజర్వేషన్ బిల్లు : ఎంఎఫ్ఐడబబ్ల్యూ

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టిన మహిళ రిజర్వేషన్ బిల్లు భారత సమాఖ్య పోరాట ఫలితమేనని భారత మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి అన్నారు. భారత పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేట్ పెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని భారత జాతీయ మహిళా సమాఖ్య నేత ప్రముఖ పార్లమెంట్ సభ్యురాలు గీతా ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొరిమి సుగుణ మాట్లాడుతూ 1996 సెప్టెంబర్ 12న పార్లమెంటులో పెట్టిన బిల్లు కోసం మహిళా సమస్య గత 27 ఏళ్లుగా పోరాటం సాగిస్తుందని అన్నారు. ఆ పోరాట ఫలితంగా 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు సాధ్యమైందని వివరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో మహిళల లోకమంతా ఆనందం వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ టౌన్ జిల్లా అధ్యక్షురాలు తిప్పాల వనిత, సెక్రటరీ పొన్నగంటి లావణ్య, గోలి లావణ్య, చింతల సుజాత, రజిత, పద్మ, సరిత, స్వరూప, సంధ్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి : రాజ్ కుమార్

నవతెలంగాణ-భూపాలపల్లి

భూపాలపల్లి ఏరియా లోని కేటీకే-5 గనిలో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం గనిలో గని మేనేజర్‌కి వినతి పత్రాన్ని అందజేసి ఆయన మాట్లాడారు. 11వ వేజ్ బోర్డ్ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లిన అధికారుల సంఘం తీరుపై మండిపడ్డారు. అక్టోబర్5,6,7 తేదీలో జరిగే సమ్మెలో కార్మి కులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణిలో ఎన్నికలు జరపాలని, ఈనెల 22న షెడ్యూల్ విడుదల చేయాలని అక్టోబం 28న ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ రూ.29 వేల కోట్లు చెల్లించాలని, సింగరేణిలో రాజకీయ జోక్యం లేకుండా కోడ్ అఫ్ డిసిప్లిన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, మైన్ ఇన్‌చార్జి ఎండి ఆసిఫ్ పాషా, ఫిట్ సెక్రటరీ దోర్నాల తిరుపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు గోవిందుల తిరుపతి, మల్లికార్జునరావు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలో నాగేంద్రబాబు, కుమారస్వామి, రాజేందర్, షిఫ్ట్ ఇన్‌చార్జి కొండపల్లి శ్రీనివాస్‌రావు,ఎం.వి డ్రైవర్ ఇంచార్జ్ ఏ సాంబయ్య,టెంపుల్ కమిటీ చైర్మన్, వీరన్న బెల్లం శ్రీనివాస్ పి చంద్రమౌళి, పి,సమ్మిరెడ్డి బండారు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఎస్‌కే మస్తాన్

నవ తెలంగాణ-గోవిందరావుపేట



ములుగు జిల్లా ఉత్తమ పోలిస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా పస్రా పోలిస్ స్టేషన్ ఎస్ఐ షేక్ మస్తాన్ ఎంపికయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అవార్డు అందజేశారు. ట్రాఫిక్ విభాగానికి గాను ఫంక్షనల్ వర్టికల్లో కానిస్టేబుల్ విక్రమ్ ఎన్నికయ్యాడు. జిల్లా ఉత్తమ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా స్థానిక ఎస్ఐ ఎంపిక కావడం పట్ల మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను ప్రజల్లోకి తీసుకువెళుతున్నారని పలువురు పేర్కొంటున్నారు.

పెరిక సంఘం ములుగు జిల్లా అధ్యక్షులుగా దిడ్డి మోహన్‌రావు

నవతెలంగాణ -తాడ్వాయి



ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క, సారక్క సన్నిధిలో మంగళవారం ములుగు జిల్లా పెరిక కుల సంఘం ఎన్నికలు జరిగాయి. సంఘం ములుగు జిల్లా అధ్యక్షునిగా తాడ్వాయి మండలం కాటాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు దిండి మోహన్ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా బండారుపెల్లికి చెందిన పెట్టెం రాజు, ఉపాధ్యక్షులుగా బండారుపల్లికి చెందిన బియ్యాల కుమారస్వామి, రామన్నగూడెంకు చెందిన ఎగ్గడి కోటయ్య ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా నూగూరు వెంకటాపురంకు చెందిన పల్నాటి నాగేశ్వర్ రావును ఎన్నుకున్నారు.

తహసీల్ధార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఓటర్ నమోదు ను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు మండలంలో ఎలాంటి పెండింగ్ పనులు ఉందొద్దని తాసిల్దార్ సతీష్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

నవతెలంగాణ-గణపురం



విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఏహెచ్‌టీయు హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. ఏహెచ్‌టీయు భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ పులి వెంకట్ ఆదేశానుసారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైంగిక దాడులు, బాండెడ్ లేబర్, బాలకార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా, గంజాయి నివారణ, మహిళలపై జరుగు దాడులపై వివరించారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ ప్రవీణ్, శ్రీనాథ్, పాఠశాల హెడ్ మాస్టర్ భరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ట్రైకార్ రుణాలపై నిర్లక్ష్య వైఖరి తగదు

తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు కుమార్

నవతెలంగాణ-మహాదేవపూర్

ఆదివాసీ గిరిజనుల ఎస్టీ ట్రైకార్ కార్పొరేషన్ రుణాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు మాడె కుమార్ అన్నారు. మంగళవారం మహాదేవపూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల సంక్షేమం కోసం ఆర్థిక స్వావలంబన అభివృద్ధి రీత్యా 2020- 2021నుండి మాడా రునల కోసం ప్రభుత్వానికి ధరకాస్తు చేసుకున్నారన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణినే అవలంభిస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం వెంటనే వారి ఆకౌంట్లలో రుణాల డబ్బును జమచేయాలని కోరారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయక్‌పోడ్ సేవా సంఘం జిల్లా ఉపధ్యక్షుడు మంగాయి సడవలి, తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి ధునే సమ్మయ్య, నాయక్‌పోడ్ సేవా సంఘం కాళేశ్వరం గ్రామశాఖ అధ్యక్షుడు వెంకటేష్, తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు కుడి మేత చిన్న సమ్మయ్య, తుడుందెబ్బ నాయకులు ఏలాధి స్వామి, తోర్రెం రాజేందర్ సోయం సమ్మయ్య, ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.



పార్లమెంటులో బిల్లు పెట్టాల్సిందే..

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయకుమార్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

ఈనెల 18 నుండి జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీలలో ఏబిసిడి వర్గీకరణ బిల్లు పెట్టాల్సిందేనని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం రిలే నిరాహార దీక్షల అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఈ పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి బిజెపి చిత్తశుద్ధి చాటుకోవాలని డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రం లో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టకపోతే రానున్న ఎన్నికల్లో బిజెపికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కందికట్ల విజయ్, ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు మారపక లక్ష్మయ్య ఎమ్మెస్పీ నియోజకవర్గ ఇన్చార్జ్ గాజుల బిక్షపతి ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రమేష్ మాదిగ జిల్లా ఉపాధ్యక్షులు దోర్నాల రాజేందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అంతడుపుల సురేష్ మాదిగ, జిల్లా కార్యదర్శి ఇంజపెల్లి ప్రవీణ్ , మహా ముత్తారం మండల కన్వీనర్ రాజయ్య , ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ కాల్వ రాజేందర్ మాదిగ ఎమ్మెస్ పి రేగొండ మండల కన్వీనర్ చిలువేరు సంపత్ గోరుకొత్తపల్లి మండల కన్వీనర్ బట్టు శీను ఎమ్మార్పీఎస్ పట్టణ కన్వీనర్ దోర్నాల భరత్ మాదిగ భార్గవ్ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు సిలివేరి పవన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా వినాయకుని విగ్రహం ఏర్పాటు ?

నవతెలంగాణ-మహాదేవపూర్

కుదురుపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులు వద్దని చెప్పినా వినకుండా పాఠశాల హెచ్ఎం, చైర్మన్ అనుమతి లేకుండా పోలీసుశాఖ అనుమతి లేకుండా వినాయకుని విగ్రహం ఏర్పాటు చేశారని విద్యా కమిటీ చైర్మన్ పర్వతాలు, గోగుల నాగేందర్ రమేష్, గట్టయ్య స్వామి, ఎల్లయ్య, రవిబాపు పలువురు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు, మహాదేవపూర్ పోలీసులు చెప్పిన వినకుండా వినాయకుని విగ్రహాన్ని పెట్టారని ఆరోపించారు. విగ్రహాన్ని పెట్టి తమ పిల్లల చదువులకు ఆటంకం కలిగిస్తున్నారని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత ఒకరిపై కేసు నమోదు

నవతెలంగాణ చిట్యాల

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. సోమవారం మండల లోని జడల్ పేట పేట గ్రామ శివారులో తమ పోలీస్ సిబ్బందితో తనిఖీ చేస్తున్న క్రమంలో కాల్వ పెళ్లి ప్రాంతం నుండి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు ఆపి పరిశీలించగా మండలంలోని అందుగు తండ గ్రామానికి చెందిన బానోతు జంపయ్యకు చెందిన ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఈ మేరకు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఎం సురేందర్, సిద్ధార్థ, లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వేజ్ బోర్డును అడ్డుకుంటే సమ్మె తప్పదు

ఎస్సీఈయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యులు మంద నరసింహారావు

నవతెలంగాణ -కోల్‌బెల్ట్



11వ వేజ్ బోర్డును అధికారులు డిపిఈ గైడ్లెన్స్ పేరుతో అడ్డుకుంటే 72 గంటల సమ్మె తప్పదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేబీసీఐ సభ్యులు మందా నరసింహారావు సింగరేణి యాజమాన్యాన్ని హెచ్చరించారు. మంగళవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే వన్ గనిలో ఫిట్ సెక్రటరీ తోట రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు ఆ సంఘం భూపాలపల్లి బ్రాంచ్ మాజీ అధ్యక్షులు వంగాల రామస్వామి మృతిచెందగా నివాళు లర్పించారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్త కార్మికుల పట్ల కక్షతోనే డిపిఈ నిబంధనలను రూపొందించిందని, దాని ఆధారంగానే అధికారుల సంఘం కోర్టుకు వెళ్లిందని అన్నారు. దేశవ్యాప్త బొగ్గు గని కార్మికుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే ఈ పార్లమెంట్ సమావేశాల్లో బొగ్గు గని కార్మికుల అమలైన వేతన ఒప్పందంపై చర్చ జరిపి వేతనాల చిచ్చుకు కారణమైన డిపిఈ నిబంధనలను ఎత్తివేయాలని కోరారు. లేదంటే అక్టోబర్ 5 ,6, 7 తేదీలలో దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేస్తామని హెచ్చరించారు. వినతి పత్రాలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వ కోల్ బెల్ట్ ప్రజాప్రతినిధులు స్వంతింటి కలపై, కార్మిక సమస్యలపై శాసన సభలో మాట్లాడకుండా గొప్పలు చెప్పుకున్నారని అన్నారు. చివరకు కార్మికుల వేతనాలపై అధికారులు కోర్టుకు వెళ్లిన విషయంపై, కేంద్ర ప్రభుత్వం విదేశాల నుండి బొగ్గు దిగుమతిని తప్పనిసరి చేసిన ఆదేశాలను వెనక్కి తీసుకునేలా పార్లమెంటులో లేవనెత్తాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి ఇచ్చే బకాయిలను ఇప్పించాలన్నారు. గనులపై టీబీజీకేఎస్ నాయకులు కార్మికుల సమస్యలు ఉన్నాయని వస్తున్నారని ఆసమస్యలను గెలిచినప్పటి నుండి ఎందుకు యాజమాన్యంతో చర్చించి పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఎన్నికల కోసం జరిగిన సమావేశంలో డైరెక్టర్ అన్ని యూనియన్లను సమానంగా గుర్తిస్తూ సర్క్యులర్ జారీ చేయకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వంకు అనుకూలంగా వ్యవహరించడం సరికాదన్నారు. సమస్యలపై అనునిత్యం కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్‌ను ఆదరించాలని కార్మికులను కోరారు. ఈ సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి కంపేటి రాజయ్య, నాయకులు కంచ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

11వ వేజ్ బోర్డుపై అధికారుల కుట్రలను తిప్పికొడదాం

బీఎంఎస్ నాయకులు అప్పాని శ్రీనివాస్

నవతెలంగాణ -కోల్‌బెల్ట్



11వ వేజ్ బోర్డుపై అధికారులు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని, కార్మికులు ఆందోళనా కార్యక్రమాలకు, సమ్మెకు సిద్ధంగా ఉండాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) భూపాలపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షులు అప్పాని శ్రీనివాస్ కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం భూపాలపల్లి ఏరియాలో కేటీకే -5 గనిలో పర్యటించి , శ్రీనివాస్ కార్మికులతో మాట్లాడారు.బొగ్గు పరిశ్రమలో పని చేస్తున్న అన్ని కార్మిక సంఘాలు బిఎంఎస్, ఎఐటియుసి,సిఐటియు, హెచ్ఎంఎస్, ఐఎన్‌టియుసి ఆల్ ఇండియా ప్రతినిధుల అత్యవసర సమావేశం రాంచీలోని సిసిఎల్ హౌస్‌లో జరిగిందని అన్నారు. బీఎంఎస్ బొగ్గు పరిశ్రమ ఇన్‌చార్జి చార్జి కొత్త కాపు లక్ష్మారెడ్డి, ఏబీకేఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ మజ్రుల్ హక్ అన్సారీ పాల్గొని బొగ్గు పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుల 11వ వేతన ఒప్పందానికి వ్యతిరేకంగా కోల్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు తీసుకున్న చర్యల వల్ల బొగ్గు పరిశ్రమలో తలెత్తిన పరిస్థితులపై చర్చించారని తెలిపారు. ఈ చర్యను ఐదు కార్మిక సంఘాల ప్రతినిధులు తీవ్రంగా ఖండించారని, ఆఫీసర్స్ అసోసియేషన్ ఈ చర్యతో బొగ్గు పరిశ్రమలో కార్మికులు, అధికారుల మధ్య ఏళ్లుగా కొనసాగుతున్న సత్సంబంధాలు దెబ్బతిన్నాయిన తెలిపారు. పై విషయాలు పరిశీలన తర్వాత, భారత ప్రభుత్వంగాని కోల్ ఇండియా మేనేజ్‌మెంట్ అధికారుల జీతాలు, సౌకర్యాలు, అలవెన్సులను 10 సంవత్సరాలలోపు కాల పరిమితి ముగియక ముందే పెంచినట్లయితే, అన్ని కార్మిక సంఘాలు దానిని వ్యతిరేకిస్తాయని సమావేశంలో నిర్ణయించారు. యాజమాన్యం గనుక మళ్ళీ పే రివ్యూ అధికారులకు వర్తింపజేస్తే.. దాని ప్రకారం బొగ్గుగని కార్మికులకు వర్తింపజేయాలని, అంతే కాకుండా ఇక నుంచి అధికారులతో బొగ్గు పరిశ్రమకు సంబంధించిన ఏ వేదికలోను కార్మిక సంఘాల ప్రతినిధులు ఎవ్వరు పాల్గొన కూడదని నిర్ణయించారని వివరించారు. ఇక బొగ్గు రంగ పరిశ్రమలో సిఐఎల్ , ఎస్ సిసిఎల్ (సింగరేణి) లో అక్టోబర్ 5,6,7 తేదీల్లో బొగ్గు పరిశ్రమలో 3 రోజుల సమ్మె చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమ్మెను విజయవంతం చేసేందుకు అన్ని యూనియన్లు సంయుక్తంగా సమ్మెకు సన్నాహాలు ప్రారంభించాలని పిలుపునిచ్చాయి. ఈ నెల 21,22 న మైన్, ఓపెన్ కాస్ట్ , డిపార్ట్ మెంట్ స్థాయిలో, అక్టోబర్ 3న ఏరియా స్థాయిలో ఉమ్మడి ధర్నా, ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వని రమేష్, యూసుఫ్,కొత్తూరి మల్లేష్, సంతోష్,సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఆర్ఏ చెల్లించాలి

ఇల్లందు, బెల్లంపల్లి, కొత్తగూడెం, మందమర్రి ఏరియాలలో చెల్లిస్తున్న విధంగా తాత్కాలిక నిర్మాణాలైనా బారక్ లలో నివసిస్తున్న కార్మికులకు హెచ్ఆర్ఏ చెల్లించాలని బీఎంఎస్ నాయకులు అప్పాని శ్రీనివాస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి రాజకీయ జోక్యం విపరీతంగా పెరి గిపోతుందని దానికి తార్కాణమే ప్రస్తుత క్వార్టర్స్ అలాట్మెంట్ విధానంలో ప్రత్యక్షంగా కనబడుతుందని, సింగరేణేతరులకు సింగరేణి క్వార్టర్లను కేటాయించడం ఏంటని సింగరేణి యాజమాన్యాన్ని నిలదీశారు. గెలిచిన కార్మిక సంఘాలు యాజమాన్యానికి, ప్రభుత్వానికి అడుగులకు మడుగులోత్తుతూ వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు.





అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-మహాదేవపూర్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తాసిల్దార్ కార్యాలయం ముందు బోనాలు బతుకమ్మలతో ఆటపాటలతో నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా అంగన్వాడీటీచర్లు, ఆయాల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సత్యవాణి, ప్రధాన కార్యదర్శి జయప్రద పాల్గొని మాట్లాడారు. మహాదేవపూర్ మండల కేంద్రంలో గత తొమ్మిది రోజుల నుంచి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేపడుతున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని, గత 40 సంవత్సరాలకు పైగా ఐసిడిఎస్ లో పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. అయినా వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధమైన సౌకర్యాలు ఏవీ కల్పించట్లేదని వాపోయారు. పక్క రాష్ట్రాలల్లో అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, అంగన్వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చారని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండుగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి సౌకర్యాలు అంగనవాడీ ఉద్యోగులకు కల్పించడం లేదని అన్నారు. వారి డిమాండ్లు పర్కిరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని అన్నారు. అంగన్వాడీ టీచర్లు రమాదేవి జ్యోతి సుజాత ఉమామహేశ్వరి శోభ, తదితరులు పాల్గొన్నారు.

మల్హార్ రావు : ప్రభుత్వం అంగన్ వాడిలకు ఇచ్చిన హామీలు,వారి సమస్యలను వెంటనే పరిస్కారం చేయాలని తెలంగాణ నిర్మాణ పార్టీ, తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన తాడిచెర్ల తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడి టీచర్లు,ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మెకు మంగళవారం తెలంగాణ నిర్మాణ పార్టీ తీన్మార్ మల్లన్న టీం సమ్మెకు మద్దతు ప్రకటించారు. అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. లేదంటే అంగన్‌వాడీలతో కలిసి పోరాటానికి తీన్మార్ మల్లన్న టీం సిద్ధంగా ఉంటుందన్నారు. తీన్మార్ మల్లన్న టీం సభ్యులు ఆర్ని రాజబాబు, చంద్రన్న, ఈర్ల విష్ణు,అంగన్ వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఘనంగా గురు పట్టాభిషేక మహోత్సవం

నవతెలంగాణ-ధర్మసాగర్

చెన్నై పట్టణం పూనమల్లె సునీత బాప్తిస్మ యోహాను దేవాలయంలో ధర్మసాగర్ గ్రామానికి చెందిన డీకన్ బ్రదర్ పుట్ట విజయ్‌ని సోమవారం మద్రాస్ మైలవరం మహా ఘన అగ్ర పీఠాధిపతి జార్జ్ అంతోని స్వామి ఆధ్వర్యంలో గురువుగా అభిషేకించారు. ఈ గురు పట్టాభిషేక మహోత్సవంలో తెలుగుదేశం పార్టీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట రజనీకాంత్,ధర్మసాగర్ గ్రామ విచారణ గురువు ఎస్ జోసఫ్, ఎస్‌డిఎం ఉపదేశి గంగారపు కమలాకర్, సంఘ పెద్ద మాచర్ల ప్రవీణ్,పుట్ట సుధాకర్, బికపతి, చిరంజీవి,శ్రీకాంత్, ప్రభాకర్, రవీందర్, శోబా రాణి, శకుంతల,నిహాల్ పాల్,గ్రామ ప్రముఖులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





కానసాగుతున్న స్వచ్ఛభారత్ ప్రోగ్రాం

నవతెలంగాణ-మహదేవపూర్

మహదేవ్‌పూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలఆవరణలో స్వచ్ఛత కార్యక్రమాన్ని మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ ప్రోగ్రాం డాక్టర్ డి.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ జన్ను విజయ కుమార్ మాట్లాడుతూ కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 15 నుండి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు ఆయా ప్రాంతాలలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించి, పర్యావరణ పరిశుభ్రతను పాటించాలని ప్రచారం చేయాలన్నాడు. అందుకు అనుగుణంగా ప్రణాళిక బద్ధంగా రోజువారి కార్యక్రమాలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లచే నిర్వహించాలని పిలుపునిచ్చారు. కళాశాల మాజీ ప్రోగ్రాం ఆఫీసర్ వి పరుశురాములు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.రాజు, టి. రజిత, కె.మున్నయ్య సి.హెచ్. రాజేందర్, జి. రవీందర్ పాల్గొన్నారు.

సూరారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో

సూరారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నాగుల లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ రమేష్ రెడ్డి, కార్యదర్శి అంజలి, పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పంచాయతీ కరోబార్ రాజమౌళి, వార్డ్ మెంబర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రత లో ఆదర్శంగా నిలుద్దాం : సర్పంచ్ శ్రీపతిబాపు

మహాదేవపూర్ మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా మంగళవారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ శ్రీపతిబాపు పాల్గొని మాట్లాడారు.పరిశుభ్రతలో మహాదేవపూర్‌ను ఆదర్శంగా నిలుపాలని సూచించారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని అన్నారు. గ్రామ కార్యదర్శి సమ్మయ్య, గ్రామస్థులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల మానవ హారం...

మహాముత్తారం : మహాముత్తారం మండలం లోని ములుగు పల్లి గ్రామ పంచాయతీలో స్వచ్ఛత హీసేవా కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మానవ హారంగా ఏర్పడి స్వచ్ఛత హీ సేవా ప్రతిజ్ఞ చేయడం జరిగింది. అనంతరం సర్పంచ్ దూలం మల్లయ్య గౌడ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఉపసర్పంచ్ దయ్యాల మీన, వార్డు సభ్యులు పెద్దల సువర్ణ, అకుడారి రాజయ్య, గద్రేపల్లి శ్రీనివాస్, కార్యదర్శి లక్ష్మి, కో ఆప్షన్ పెండ్యాల సాంబయ్య, వీఓఏ పుష్ప లత, ఏఎన్ఎం శారద, ఆర్ఎంపి వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలు తీర్చిదిద్దడంలో తమ వంతు కృషి చేస్తామని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. మంగళవారం కేజీబీవి మహ ముత్తారంలో విద్యార్థులు , ఉపాధ్యాయులతో స్వచ్ఛ గ్రామాలుగా తీర్చి దిద్దడంలో తమ వంతు కషి చేస్తామని ప్రతిజ్ఞ చేపించారు. కేజీబీవి స్పెషల్ ఆఫీసర్, పుణ్యవతి మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పలిమెల : మండల కేంద్రంలో మంగళవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ జవ్వాజి పుష్పలత పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఇంటిలో పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామ పరిశుభ్రత మనందరి బాధ్యత అని అన్నారు సీజనల్ వ్యాధులు కూడా రాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అంగన్వాడీ టీచర్స్ ఉపాధ్యాయులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు ఎల్ఓసీ అందజేత

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన కటుకు శ్రీకాంత్ కు మంజూరైౖ రూ.1,50,000 విలువైన ఎల్ఓసీ పత్రాన్ని మంగళవారం నిమ్స్ ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

విషజ్వరంతో బాలిక మృతి

నవతెలంగాణ-మల్హార్‌రావు

విషజ్వరంతో అధ్యశ్రీ (8) అనే బాలిక మృతి చెందిన సంఘటన మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. మృతురాలు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం అధ్యశ్రీకి నాలుగైదు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. భూపాలపల్లి ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం హన్మకొండకు రెఫర్ చేశారు. దీంతో హన్మకొండ లోని ప్రయివేటు ఆసుపత్రిలో బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ జ్వరం వచ్చినట్లు వైద్యులు చెప్పారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాలిక మంగళవారం మృతిచెందినట్లు తెలిపారు. విషజ్వరంతో చిన్నారి మృతి చెందడంతో ఎడ్లపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఎస్‌డీఎల్‌సీఈ భవనంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-హసన్‌పర్తి

కాకతీయ పోలీసు స్టేషన్ పరిధి కేయూ ఎస్‌డీఎల్‌సీఈ భవనంలో సోమవారం వినాయక చవిత పండుగ రోజు 60 సంవత్సరాల గుర్తు తెలియని వృద్దుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ ముసుగు అబ్బయ్య తెలిపారు. ఎస్సై రాజుకుమార్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా మృతుడు నీలం రంగు చొక్కా, తెలుపు రంగు ప్యాంటు ధరించి చామనచాయ రంగులో ఉన్నాడని తెలిపారు. చేతికి రాకీ కట్టి ఉన్నట్లు వెల్లడించారు. శవపంచనామా జరిపించి ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతునికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిస్తే సంబంధిత కేయూ పోలీసు స్టేషన్ 8712685004కు సమాచారమివ్వాలని కోరారు.

ఉదారత చాటిన జెడ్పీ చైర్మన్ పుట్ట

స్పర్ష్ హస్పైస్‌కు రూ.50వేల విరాళం

నవతెలంగాణ-మల్హర్‌రావు

పేదోడికి అనారోగ్యం చేస్తే మంచి వైద్యం అందించాలని ఆరాటపడే బీఆర్ఎస్ పార్టీ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ మరో అడుగు ముందుకు వేసి తన ఉదారతను చాటుకున్నారు. తాజాగా ఓ ఆస్పత్రికి ఏకంగా రూ.50వేలు విరాళంగా అందజేశారు.హైదరాబాద్‌లోని స్పర్ష్ హస్పైస్ ఆస్పత్రిలో మండలంలోని కొయ్యూర్ గ్రామానికి చెందిన ఎర్రం కిషన్‌రాజు అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా ఆయనను జెడ్పీ చైర్మన్ మంగళవారం పరామర్శించారు. కిషన్‌రాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ క్రమంలో ఆస్పత్రి రోటరీ క్లబ్ ఆఫ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తుందని వివరించారు. పూర్తివివరాలు తెలుసుకున్న ఆయన అవసాన దశలో ఉన్నపేదలను కంటికి రెప్పలా చూసుకుంటూ మంచి వైద్యం అందిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు.అంతేకాకుండా ఆస్పత్రి నిర్వహణకు తనవంతుగా రూ.50వేలు అందజేశారు.విరాళంగా అందజేసి తన మానవత్వం చాటుకున్నారు. కాగా ఆస్పత్రి నిర్వహణకు విరాళం అందజేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.





ఎమ్మెల్సీ కవితను కలిసిన జెడ్పీ చైర్మన్

నవతెలంగాణ-మల్హర్‌రావు/మహదేవపూర్

భారత జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి కతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్‌లో మహిళ బిల్లును ప్రవేశపెట్టడంలో కీలకపాత్ర పోషించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు తెలిపారు.

పని బారెడు... జీతం బెత్తెడు...

జటిలం అవుతున్న సమగ్ర సమస్య - పరిష్కారం చూపాలని ఉద్యోగుల విన్నపం

క్రమబద్ధీకరణ.. కనీస వేతన స్కేలు కోసం ఉద్యోగుల డిమాండ్

ఉద్యోగుల ఆందోళనతో ఎమ్మార్సీలకు తాళాలు, నిలిచిపోయిన సేవలు..

బోధనకు అవరోధం, ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని అంటున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-నెల్లికుదురు

గత 15 ఏళ్లుగా విద్యా వ్యవస్థలో మూల స్తంభాలుగా నిలిచి కీలక పాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళనలతో సమస్య జటిలంగా మారుతుంది. సమగ్ర శిక్ష ఉద్యోగులు సమస్య సాధన కోసం గత పది రోజులుగా వివిధ రూపాలలో నిరసనలు తెలుపుతున్నారు. చాలీచాలని వేతనాలతో బతుకు బండిని ఈడ్చుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు స్వరాష్ట్ర సిద్ధిస్తే బతుకులు బాగుపడతాయి అనుకున్న వారికి నిరాశ ఎదురైంది. సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి తమ సమస్యలకు దారి చూపాలని వేడుకుంటున్నారు. విద్యా వ్యవస్థకు మూల స్తంభాలుగా నిలిచిన శిక్ష ఉద్యోగులు కాంట్రాక్టు పద్ధతిన డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రూల్ ఆఫ్ రోస్టర్, మెరిట్ ఆధారంగా పలు విభాగాలలో నియమితులై చాలీచాలని వేతనాలతో వెట్టి చాకిరి చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయిలో.. అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్, సిస్టం అనలిస్ట్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, మండల విద్యాశాఖలో... ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెసెంజర్లు, కాంప్లెక్స్ పరిధిలో... క్లస్టర్ రిసోర్స్ పర్సన్ లుగా, పాఠశాలలో...వృత్తి విద్య బోధన చేసే పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లుగా వేరువేరు విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ చాకిరి చేస్తున్న కనీస వేతనాలకు నోచుకోలేదు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని భారత అత్యున్నత న్యాయస్థానం ఆదేశించిన, నూతన విద్యా విధానం కమిటీ ఉద్యోగులందరికీ కనీస వేతనాలను అమలు చేయాలని నివేదించిన తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు నేటికీ అమలుకు నోచుకోలేదు. విద్యాశాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగులు లేకుంటే ఏ పని కాదన్నది అతిశయోక్తి కాదు.

చాలీచాలని వేతనాలతో ఉద్యోగుల అవస్థలు...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి అన్ని శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందర్నీ క్రమబద్ధీకరిస్తానని ఉద్యమ సమయంలో తెలిపిన ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు నీటి మూటలు గానే మిగిలాయని సమగ్ర శిక్ష ఉద్యోగులు వాపోతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒకేసారి నియమితులై ఒకే జీతం తీసుకునేవారు కానీ నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 30,500 పైగా వేతనా లు తీసుకుంటే ధనిక రాష్ట్రమని చెబుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణల స మగ్ర శిక్ష ఉద్యోగులకు 19500 రూపాయల వేతనాలు ఇస్తున్నారు. ఇప్పటికైనా వి ద్యారంగ బలోపేతానికి కషి చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ కనీస వేతన స్కేలు అమలుపరచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగుల ఆందోళనలతో ఎమ్మార్సీలకు తాళాలు...

సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకు నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో మండల విద్యా వనరుల కేంద్రాలకు తాళాలు పడ్డాయి. మండల విద్యా వ్యవస్థకు ప్రభుత్వ ఉద్యోగులు లేకపోవడం పూర్తిగా కాంట్రాక్టు ఉద్యోగుల పైన ఆధారపడడంతో వీరంతా ఆందోళనల్లో పాల్గొనడంతో విద్యా వ్యవస్థ కుంటుపడింది. పాఠశాలల్లో సైతం బోధకులు నిరసన తెలపడంతో అంతరాయం ఏర్పడుతుంది. మధ్యాహ్నం భోజనం బిల్లులు, విద్యార్థుల ప్రగతి నివేదికలు, మన ఊరి మనబడి నివేదికలు, యు డేస్ నివేదికలు మండల స్థాయిలో చేయాల్సి ఉండగా పనులన్నీ పూర్తిగా స్తంభించాయి. ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ట్రాన్స్ఫర్లు చేపట్టడంతో ఆన్లైన్లో నమోదు చేసుకున్న ఉపాధ్యాయుల వివరాలను మండల విద్యా వనరుల కేంద్రానికి అప్పగించాల్సి ఉంది. అక్కడ సిబ్బంది ఉపాధ్యాయుల ప్రమోషన్లు ట్రాన్స్ఫర్ ల ప్రక్రియను క్రోకోడీకరించి జిల్లా స్థాయికి నివేదిస్తారు కాగా ఉద్యోగులంతా ఆందోళన బాటలతో ఉండడంతో ఉపాధ్యాయులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఉపాధ్యాయుల సమస్యలే ఇప్పటికే ఆలస్యం కాగా మాకు సహకరించే మండల విద్యా వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులు లేకపోవడంతో మా పనులు ఎట్లా సాగాలో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఎమ్మార్సీ సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యా వ్యవస్థ మరింత అభివద్ధికి తోడ్పాటు అందించాలని కోరుతున్నారు.

క్రమబద్ధీకరించండి....కష్టాలు తీర్చండి : మహంకాళి వీరన్న ఎస్-ఎస్ఏ జేఏసీ జిల్లా అధ్యక్షుడు, మహబూబాబాద్



విద్య పటిష్టకై గత 15 ఏళ్లుగా చాలి చాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్దీకరించి...వేతన కష్టాలను తీర్చాలి.జిల్లా వ్యాప్తంగా సిఆర్పిలు కోఆర్డినేటర్ కంప్యూటర్ ఆపరేటర్ కేజీబీవీ టీచర్లు నాన్ టీచింగ్ సిబ్బంది మోడల్ స్కూల్ నాన్‌టీచింగ్ సిబ్బంది పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు మెసెంజర్లు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేసే ఎస్ఎస్సి ఉద్యోగులు అందరు కలిపి మొత్తం 670 మంది పనిచేస్తున్నారు విద్య శాఖకు సం బంధించిన ప్రతి పనిలో క్షేత్రస్థాయి నుండి సమాచార సేకరణలో కీలకపాత్ర పో షిస్తూ జిల్లా రాష్ట్ర విద్యా శాఖలకు సమాచారాన్ని అనుసంధానం చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలి.

ఇంకెన్నాళ్లు ఈ చాలీచాలనీ వేతనాలు : మంజుల, ఎస్ఎస్ఏ జాక్ మహిళా అధ్యక్షురాలు



పెరిగిన నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా జీతాలు రాక ఇంకా ఎన్నాళ్లు ఈ చాలీచాలనీ వేతనాలతో విధులు నిర్వహించాలి. గత 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ మమ్మల్ని రెగ్యులరైజేషన్ చేయకపోవడం దారుణం. ఎంతోమంది విద్యార్థులను భవిష్యత్తులను తీర్చిదిద్దే మాకే భవిష్యత్తు లేకుండా పోతుంది. మమ్మల్ని రెగ్యులరైజేషన్ చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలి.

ఉద్యోగ భద్రత లేని అంగన్వాడి జాబ్..

48 సంవత్సరాల నుండి వెట్టిచాకిరి..



నవతెలంగాణ-చిన్నగూడూరు

అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కనీస వేతనం రూ.26 వేలు పెన్షన్, ఐఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ నిరవధిక సమ్మె చేపట్టారు. సమ్మె 9వ రోజు చేరుకుంది. నవతెలంగాణ ప్రతినిధి వారి సమస్యలపై అంగన్వాడీ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. 48 సంవత్సరాల నుండి వెట్టిచాకిరి చేస్తున్నామని అయినా ప్రభుత్వం మాపై సరైన గుర్తింపు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రభుత్వం చెప్పిన ప్రతి సర్వేలు ఓటర్ లిస్ట్, సీజనల్ వ్యాధులు, కంటి వెలుగు, కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఇళ్లిళ్లు తిరిగి సర్వే చేశామని తెలిపారు. పనికి తగ్గ వేతనం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మండల వ్యాప్తంగా 32 అంగన్వాడి సెంటర్లకు 29 అంగన్వాడి సెంటర్లు, 3 మినీ అంగన్వాడి సెంటర్లు ఉన్నాయి.కేవలం 5 సెంటర్లకే సొంత భవనాలు ఉన్నాయి. ప్రభుత్వమే రికార్డులను సరపర చేయాలి. (ఎన్ఎచ్టీఎస్) న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం, పోషణ్ ట్రాకర్స్, బీఎల్వో యాప్ లను రద్దు చేయాలి. అనవసరమైన పని ఒత్తిడితో అనారోగ్య పాలవుతున్నా అని తెలిపారు. ఇంచార్జ్ వేయడంతో ఆన్లైన్ చేసే సమయంలో ఒత్తిడికి లోనవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడి టీచర్స్ మండల అధ్యక్షురాలు, బరపటి సులోచన



అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26వేలు పెంచాలి. అదేవిధంగా పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి. రిటర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షల చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రధాన కార్యదర్శి, మన్నె జ్యోతి



ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయరంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగస్తులందారిన్ని పర్మినెంట్ చేశారని తెలిపారు .అదే విధంగా మా అంగన్వాడి టీచర్లను, హెల్పర్లను పర్మినెంట్ చేయాలని కోరారు. తొమ్మిది రోజుల నుండి సమ్మె చేస్తున్నామని వయస్సు పైబడిన టీచర్లు, ఆయాలు అస్వస్థకు గురై పడిపోతున్నారు. సత్వరమే మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

ఉపాధ్యక్షురాలు, వెంకటరత్నం



2017 నుండి టీఏలు, డీఏలు ఎలాంటి అలవెన్స్ ఇవ్వడం లేదని అన్నారు. 20వ తేదీ వచ్చేంతవరకు కూడా జీతాలు సరిగా పడడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నేను చార్జీలు పెంచాలని కోరారు.

హెల్పర్, యమునా



ఎండాకాలంలో ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్వాడి కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని కోరారు.

జాతీయస్థాయి నెట్ బాల్ పోటీలకు విద్యోదయ విద్యార్థులు

నవతెలంగాణ-నెక్కొండ

జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు నెక్కొండలోని విద్యోదయ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చల్లా నాగార్జున్ రెడ్డి మంగళవారం చెప్పారు. ఈ నెల 9,10,11, తేదిల్లో నిర్మల్ జిల్లా శాంతినగర్‌లోని జేవిఎన్ఆర్ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ క్రీడా పోటీల్లో వరంగల్ జిల్లా నుండి ఎండి. సమ్రీన్, బి.అక్షయలు అత్యుత్తమ ప్రతిభ కనపర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 21నుంచి హర్యానోలో జరిగే 41వ జాతీయస్థాయి నెట్ బాల్ ఛాంపియన్షిప్ ఫర్ వుమెన్ (సీనియర్) విభాగంలో తెలంగాణ జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. కరస్పాండెంట్ చల్ల నాగార్జున రెడ్డి, డైరెక్టర్ చల్ల పారిజాతం అభినందించారు.

బాబు అరెస్ట్‌ను ఖండిస్తున్నాం

అర్షనపల్లి విద్యాసాగర్ రావు

నవతెలంగాణ-వరంగల్

టీడీపీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని టిడిపి వరంగల్ పార్లమెంట్ అధ్యక్షులు అర్షనపల్లి విద్యాసాగర్ రావు అన్నారు. మంగళవారం టీడీపీ రాష్ట్ర నాయకులు చెన్నోజు రఘుబాబు ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ సెంటర్ నుండి పోచమ్మ మైదాన్ సెంటర్ వరకు బాబుకి సంఘీభా వంగా నాయకులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీనీ వరంగల్ పార్లమెంట్ అధ్యక్షులు అర్షనపల్లి విద్యాసాగర్‌రావు హాజరై మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు హయాంలోనే ఇంజనీరింగ్ విద్యకు, పరిపాలన సౌలభ్యానికి, ఐటి పరంగా సైబరబాద్ డెవలప్ చేయడంలో,అన్ని రంగాలను అభివృద్ధి చేసిన స్ఫూర్తి ప్రధాత నారా చంద్ర బాబు నాయుడు అని, అందుకే దేశవ్యాప్తంగా కాకుండా ప్రపంచ వ్యాప్తంగా చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తున్నారని, పార్టీలకు అతీతంగా నాయకులు, మేధావులు, అభిమానులు చంద్రబాబుకి సంఘీభావం తెలుపు తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి పుల్లయ్య, వరంగల్ పశ్చిమ ఇంచార్జి ఎం డీ రహీమ్, చంద్రబాబు యువసేన అధ్యక్షులు చేన్నోజు రఘుబాబు, పార్లమెంట్ నాయకులు యాకుబ్, జయశంకర్, కేదాసి స్వామి, సురేష్, సతీష్, మహేందర్, కంద్రాతి రాజు, తౌటం సంపత్, వెంకటేశ్వర్లు, సంపత్ రెడ్డి, శ్యామ్, తూనం స్వామీ, పెరం వీరస్వామీ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

నవతెలంగాణ-నెక్కొండ

ఈ వానకాలం సీజన్లో రైతులకు అందుబాటులోకి యూరియా తెచ్చామని ఎలాంటి ఆందోళన రైతులు చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి నాగరాజు చెప్పారు. సహకార సంఘాలు రెడ్లవాడ, నెక్కొండ, చెన్నారావుపేట పరిధిలోని విక్రయ కేంద్రాలు, రైతు ఆగ్రో సేవా కేంద్రం తోపాటు ప్రైవేట్ దుకాణాల్లో రైతులకు అందుబాటులో 314 మెట్రిక్ టన్నుల యూరియా ఉందన్నా రు. రైతులకు సమీపంలో ఉన్న విక్రయ కేంద్రాల ద్వారా రైతులు యూరియాను పొందవచ్చున్నారు.

నాలుగు గ్రామాలలో కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

నవతెలంగాణ-గూడూరు

మండలంలోని తీగలవేణి, గోవిందాపురం, లక్ష్మంపురం, పాటిమీదితండ గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం గ్రామ కాంగ్రెస్ కమిటీలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూనావత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఆయా గ్రామ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ పార్టీ కమిటీలను, అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది. తీగలవేణి గ్రామ కాంగ్రెస్ పార్టీగ్రామ అధ్యక్షుడుదారవత్ హెమ్ల నాయక్, ఉపాధ్యక్షుడుగడ్డం బాబు, ప్రధాన కార్యదర్శిమూడు వీరన్న, యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గుగులోత్ రవికుమార్,గోవిందాపురం కాంగ్రెస్ పార్టీగ్రామ అధ్యక్షుడుబాణోత్ భగవాన్,ఉపాధ్యక్షుడు కట్రోజు వేణుగోపాల చారి,ప్రధాన కార్యదర్శ మూడ్ వీరన్నలక్ష్మి పురం గ్రామ కమిటీ అధ్యక్షులు వాంకుడోత్ నవీన్,ఉపాధ్యక్షులు బానోత్ హరిలాల్,ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ కిషన్ గ్రామయూత్ అధ్యక్షుడు అజ్మీర అజయ్, పాటి మీది తండఅధ్యక్షులుబానోతు వాగ్యఉపాధ్యక్షులు బాదావత్ కాలియా, ప్రధాన కార్యదర్శివాంకుడోత్ నరసింహలను ఎన్నుకున్నారు. ఈ గ్రామ కమిటీ ఎన్నికలలో రాష్ట్ర మైనారిటీ సెల్ నాయకుడు యాకూబ్ పాషా, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేం శ్రీనివాస్ రెడ్డి, తీగలరని ఎంపీటీసీ వేం వాసు దేవా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బీరం శ్రీపాల్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ వేం వాసుదేవా రెడ్డి, మండల యూత్ ప్రెసిడెంట్ చంటి స్వామి, మండల నాయకులు గోపగాని యాదగిరి, మండల మల్లేష్ మరియు గ్రామ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఝాన్సీ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : రంగు మురళీ

నవతెలంగాణ-పెద్దవంగర

కాంగ్రెస్ అగ్ర నాయకులు ఇటీవల ప్రకటించిన గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, విస్తృతంగా ప్రచారం చేపట్టాలని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రంగు మురళి, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి సతీష్, యూత్ నాయకులు పస్నీర్ వేణు అన్నారు. మంగళవారం వడ్డెకొత్తపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నికకు వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. అనంతరం గ్రామ నూతన కమిటీ వివరాలను ప్రకటించారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా దంతాలపల్లి ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా బొల్లు వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా భాషబోయిన యాకయ్య, కోశాధికారిగా జాటోత్ చందర్, తుర్క భాస్కర్, సభ్యులుగా దంతాలపల్లి సోమనర్సయ్య, ఓర్సు ఎల్లయ్య, మద్దెల వెంకటసోములు, ఆంగోత్ లచ్చిరాం, మేకల రమేష్, బీసీ సెల్ గ్రామ అధ్యక్షుడిగా ముత్తినేని సోమేశ్వర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా చందర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా రంజాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఉపేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారి వెంకన్న, దంతాలపల్లి రవి, జాటోత్ వెంకన్న, దండుగల ఎల్లయ్య, ఎస్కే సైదులు, దంతాలపల్లి ఎల్లయ్య, సోమ్లు నాయక్, యాకన్న, దండుగల మైసయ్య, దంతాలపల్లి లక్ష్మయ్య, బాలాజీ, మద్దెల సోమయ్య, దంతాలపల్లి ప్రశాంత్, గద్దల సతీష్, కొమ్ము శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మనం నవాబులం కాదు భారతీయ మూలవాసులం : రచయిత స్కైబాబా

నవతెలంగాణ-మహబూబాబాద్

మనం నవాబులం కాదు భారతీయుల మూలవాసులం అని రచయిత స్కైబాబా అన్నారు. మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని 'కిరాణా వర్తక సంఘం' హాల్‌లో 'ముస్లిం డిక్లరేషన్' పేరుతో 20కి పైగా ఉన్న డిమాండ్లతో కూడిన పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం మహబూబాబాద్ జిల్లా తెలంగాణముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్, మైనారిటీ రైట్స్, ప్రొటెక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ అన్సారీ, రచయిత, జర్నలిస్టు, టీఎస్ జాక్ రాష్ట్రనాయకులు స్కైబాబ, అలాగే, వక్తలుగా తెలంగాణా సీనియర్ రిసెర్చ్ ఫెలో,పీహెచ్‌డీ స్కాలర్ ఉస్మానియా యూనివర్సిటీ ముస్లిం జేఏసీ కో కన్వీనర్ జీనత్ ఫర్ ఆజ్మీ, తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్ జేఏసీరాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ సయ్యద్‌నవాజ్ పాల్గొని ముస్లిం సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఫ్తి అలంగీర్, అబ్దుల్ హమీద్,సయిద్ అహ్మద్ రిజ్వీ, పాల్గొన్నారు.